నేటి కందం- నేటికి అందం

మారిన తమ దృక్పథమును
తారిక్రహమాను భారతమునకు తెలుపన్
భారీగా వీసాలను
జారీ చేయగ మొదలిడె సర్వులు మెచ్చన్ !!

(బంగ్లా దేశ్ లో ప్రజాస్వామ్య పద్ధతిలో అధికారం లోకి వచ్చిన తారిక్ రెహమాన్ భారత్ తో సత్సంబంధాలు కోరుతూ భారత్ కు వీసా లను జారీ చేయడం ప్రారంభించారు. ఇది భారత్ తరపున మోడీ సాధించిన మరో విజయం గా రెండు దేశాల్లోని విజ్ఞులు చెబుతున్నారు.)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

చురక

పార్లమెంట్ సభ్యులతో
ఫ్రెండ్ షిప్ బృందాలు
విదేశాల్లో విహరించి
వేస్తరంటా బంధాలు
ఉన్న ఫ్రెండ్సుచాలదనే
ఉరకలెత్తే తన వ్యూహం
ప్రభుత్వం ఎందుకింకా
పెంచుకునే వ్యామోహం



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ బుధవారం 25-2-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:163 పేజీలు:6 వెల: రూ.1/-


# తెలంగాణ డీజీపీ ఎదుట లొంగిపోయిన మావోయిస్టు కీలక నేతలు



హైదరాబాద్, ఫిబ్రవరి 24: తెలంగాణలో నలుగురు మావోయిస్టు అగ్రనేతలు మంగళవారం తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో అధికారికంగా లొంగిపోయారు. వీరిలో పొలిట్ బ్యూరో సభ్యుడు (పీబీఎం) తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ అలియాస్ కుమ్మ దాదా, సెంట్రల్ కమిటీ సభ్యుడు (సీసీఎం) మల్లారాజి రెడ్డి అలియాస్ సంగ్రామ్ అలియాస్ రంగారం, తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి బడే చొక్కారావు అలియాస్ దామోదర్ అలియాస్ జగన్, రాష్ట్ర కమిటీ సభ్యుడు (ఎస్‌సీఎం) నూనె నరసింహా రెడ్డి అలియాస్ గంగన్న అలియాస్ రన్నా దాదా ఉన్నారు. 40 ఏళ్లకు పైగా అజ్ఞాతంలో పనిచేసిన ఈ అగ్రనేతలు లొంగుబాటు నిర్ణయం తీసుకున్నారు. దీంతో మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ పూర్తిగా నిర్వీర్యం అయినట్లు పోలీసులు ప్రకటించారు.

### ఆ 11 మంది జనజీవనంలోకి రండి: డీజీపీ

ఈ నలుగురి లొంగు బాటుతో మావోయిస్టు పార్టీలో అగ్రస్థాయి బాధ్యతలు నిర్వహించిన ఇద్దరు కీలక నేతలు జనజీవన స్రవంతిలోకి వచ్చినట్లు డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. మావోయిస్టు పార్టీలో తెలంగాణకు చెందిన ఇంకా 11 మంది అజ్ఞాతంలో ఉన్నారని అన్నారు. వారు కూడా త్వరలో జనజీవనంలోకి రావాలని డీజీపీ కోరారు. ముప్పాళ్ల లక్ష్మణ్ రావు అలియాస్ గణపతి అడవుల్లో లేరని, బయట ఎక్కడో షెల్టర్ తీసుకున్నట్లు గుర్తించామన్నారు. తెలంగాణ ప్రభుత్వ పునరావాస పథకం ప్రకారం తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీపై రూ.25 లక్షలు, మల్లారాజి రెడ్డిపై రూ.25 లక్షలు, బడే చొక్కారావు, నూనె నరసింహా రెడ్డిలపై రూ.20 లక్షల చొప్పున నగదు రివార్డు మొత్తాన్ని వారికి అందజేస్తామని ప్రకటించారు. 2019లో తెలంగాణలో మావోయిస్టులు రిక్రూటమెంట్ జరిగిందని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు.

1982లో సీపీఐ (ఎంఎల్) పీపుల్స్ వార్‌లో చేరిన తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ దండకారణ్యంలో ఆయుధ దళ కార్యకలాపాలు నిర్వహించారు. 1984-89 మధ్య సిరోంచా, పెరిమిలి ప్రాంతాల్లో దళ కమాండర్‌గా పనిచేశారు. 1989లో డివిజనల్ కమిటీ సభ్యుడిగా, 2001లో సెంట్రల్ కమిటీ, సెంట్రల్ మిలిటరీ కమిషన్ సభ్యుడిగా, 2017లో సీఎంసీ ఇన్‌ఛార్జ్‌గా, తర్వాత పొలిట్ బ్యూరో సభ్యుడిగా (పీబీఎం) ఎదిగారు.

1970లలో ఉద్యమంలోకి వచ్చిన మల్లారాజి రెడ్డి.. 1980లలో డివిజనల్ కమిటీ, రాష్ట్ర కమిటీ స్థాయికి ఎదిగారు. 1990లో సీసీఎంగా నియమితులయ్యారు. మహారాష్ట్ర, దండకారణ్య ప్రాంతాల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు. 2007లో పీబీ సభ్యత్వం, 2010-16 మధ్య ఛత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దు స్పెషల్ జోనల్ కమిటీ ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరించారు.

1996లో ఆర్‌ఎస్‌యూ ద్వారా పార్టీలో చేరి 1999-2000లో ఏటూరునాగారం-మహాదేవపూర్ ప్రాంతాల్లో పార్టీ సభ్యుడిగా పనిచేశారు. తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. తెలంగాణ, ఇతర ప్రాంతీయ కమిటీలలో కీలక బాధ్యతలు చేపట్టారు. నూనె నరసింహా రెడ్డి కూడా రాష్ట్ర కమిటీ స్థాయిలో కీలక పాత్ర పోషించారు.

# జీహెచ్ఎంసీ ఎన్నికల్లో వాస్తవాలన్నీ ప్రజల ముందుంచుతాం: బండి సంజయ్



హైదరాబాద్, ఫిబ్రవరి 24: భాగ్యలక్ష్మి అమ్మవారి ఆశీస్సులతోనే కరీంనగర్‌లో మేయర్ పీఠాన్ని కైవసం చేసుకున్నామని కేంద్ర మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. పాతబస్తీలోని భాగ్యలక్ష్మి ఆలయం వద్ద మొక్కులు తీర్చుకునేందుకే కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని కార్పొరేటర్లు, కౌన్సిలర్లతో కలిసి ఆలయానికి వచ్చినట్లు తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. భాగ్యలక్ష్మి ఆలయం ఎంతో పవర్‌ఫుల్ అని, భవిష్యత్తులో బీజేపీ అధికారంలోకి వస్తే పంజాబ్‌లోని స్వర్ణ దేవాలయం తరహాలో ఈ ఆలయాన్నీ గోల్డెన్ టెంపుల్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. పాతబస్తీ హిందువులకు భాగ్యలక్ష్మి అమ్మవారు రక్షణగా నిలుస్తున్నారని పేర్కొన్నారు.

గతంలో ప్రజా సంగ్రామ యాత్రను భాగ్యలక్ష్మి అమ్మవారి ఆశీస్సులతో ప్రారంభించామని, కేసీఆర్ ప్రభుత్వ అడ్డంకులను ఎదుర్కొని 1640 కిలోమీటర్ల పాదయాత్రను విజయవంతంగా పూర్తి చేశామని బండి సంజయ్ తెలిపారు. హైదరాబాద్‌లో హిందూ సమాజానికి ఏ ఆపద వచ్చినా అడ్డుకునేందుకు బీజేపీ సిద్ధంగా ఉందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్ర విమర్శలు చేసిన బండి సంజయ్.. ఆలయాలపై దాడులు జరుగుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని ఆరోపించారు. సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయం, బంజారాహిల్స్ పెద్దమ్మ ఆలయం, శంషాబాద్ ఆలయాలపై దాడులు జరిగాయన్నారు.

బాన్సువాడలో హిందువులపై రాళ్లదాడి జరిగినా బాధ్యులపై చర్యలు తీసుకోవడం లేదని, అమాయకులను అరెస్ట్ చేయడం సరికాదని కేంద్ర మంత్రి మండిపడ్డారు. పోలీసులు అక్రమ అరెస్టులను ఆపాలని హెచ్చరించారు. అవసరమైతే తానే బాన్సువాడకు వెళ్లి హిందువులకు రక్షణగా నిలుస్తానన్నారు. హైదరాబాద్ అభివృద్ధి కేంద్ర నిధులతోనే జరుగుతోందని, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ఉద్యోగులకు బకాయిలు, మహిళలకు ఆర్థిక సాయం, నిరుద్యోగ భృతి వంటి హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల ముందు ఉంచుతామని బండి సంజయ్ స్పష్టం చేశారు.

# మేమున్న పరిస్థితి అర్థం చేసుకోండి.. మీడియాతో మావోయిస్టు అగ్రనేత దేవ్‌జీ



హైదరాబాద్, ఫిబ్రవరి 24: మావోయిస్టు అగ్రనేతలు నలుగురు నేడు తెలంగాణ పోలీసుల ముందు లొంగిపోయిన సంగతి తెలిసిందే. దేవ్‌జీ అలియాస్ తిప్పిరి తిరుపతి(పొలిట్ బ్యూరో కమిటీ మెంబెర్).. మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్ (సెంట్రమ్ కమిటీ మెంబెర్).. బడే చొక్కారావు అలియాస్ దామోదర్ అలియాస్ జగన్(తెలంగాణ స్టేట్ సెక్రటరీ).. నూనె నరసింహారెడ్డి అలియాస్ గంగన్న సన్ను దాదా (స్టేట్ కమిటీ మెంబర్) పోలీసుల ముందు లొంగిపోయారు. పోలీసులు ఈ నలుగురినీ మంగళవారం మీడియా ముందుకు తీసుకువచ్చారు.

ఈ సందర్భంగా దేవ్‌జీ మీడియాతో మాట్లాడుతూ.. 'అనారోగ్య కారణాల రీత్యా నేను లొంగిపోయాను. రహస్య జీవితం నుంచి బహిరంగ జీవితం గడపాలని భావిస్తున్నాను. దశాబ్దాల కాలం నుంచి నేను నమ్మిన సిద్ధాంతాల ప్రకారమే ప్రజల కోసం పనిచేస్తాను. ప్రజల సమస్యలపై ప్రజల్లో ఉండి పోరాటం చేస్తాను. త్వరలో రాజకీయ ప్రవేశం చేసి ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని భావిస్తున్నాను. మీరు అడిగిన ప్రశ్నలన్నిటికీ సమాధానం చెప్పే పరిస్థితిలో లేను. నేను ఏది మాట్లాడినా అపార్థాలకు దారితీసే విధంగా ఉంటుంది. నేను రాజకీయ జీవితం కొనసాగించాలని కోరుకుంటున్నాను. మీరడిగే ప్రశ్నలకు నేను చెప్పే జవాబు.. రాజకీయ జీవితానికి ఇబ్బంది కలిగించవద్దని అన్ని విషయాలు పంచుకోవడం లేదు' అని అన్నారు.

త్వరలో అన్ని ప్రశ్నలకు జవాబు: మల్ల రాజిరెడ్డి

మల్లా రాజిరెడ్డి మాట్లాడుతూ.. 'ప్రజలతో కలిసి పనిచేయాలని భావిస్తున్నాం. ప్రజల హక్కుల కోసం పోరాటం చేస్తాం. చట్ట ప్రకారమే పోరాటం చేయాలని లొంగిపోయాం. మావోయిజం అనేది ఎప్పటికీ అంతం కాదు. కొన్ని ప్రశ్నలను ప్రభుత్వంతో చర్చిస్తాం. త్వరలో అన్ని ప్రశ్నలకు జవాబు చెప్తాం' అని అన్నారు.

## 27 సంవత్సరాల విరామం తర్వాత ఎన్నికల కమిషనర్ల జాతీయ రౌండ్ టేబుల్ సమావేశం

న్యూఢిల్లీ ఫిబ్రవరి 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );న్యూఢిల్లీలోని భారత్ మండపంలో మంగళవారం జరిగిన ,రాష్ట్ర ఎన్నికల కమిషనర్ల జాతీయ రౌండ్ టేబుల్ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ శ్రీమతి. ఐ.రాణి కుముధిని పాల్గొన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి ప్రధాన ఎన్నికల కమిషనర్ శ్రీ జ్ఞానేష్ కుమార్, ఎన్నికల కమిషనర్లు డాక్టర్ సుఖ్‌బీర్ సింగ్ సంధు ,డాక్టర్ వివేక్ జోషి అధ్యక్షత వహించారు. 27 సంవత్సరాల విరామం తర్వాత ఈ రౌండ్ టేబుల్ సమావేశం జరుగడం విశేషం . చివరి రౌండ్ టేబుల్ సమావేశం 1999 సంవత్సరంలో జరిగింది.

## అధికారికంగా కేరళమ్‌గా మారనున్న కేరళ.. పేరు

### -మార్పు ప్రతిపాదనకు కేంద్రం ఆమోదం తెలిపే ఛాన్స్..!

కోయంబత్తూర్ ఫిబ్రవరి 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: కేరళ రాష్ట్రం పేరు ఇక అధికారికంగా కేరళమ్ గా మారనుంది. సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ పేరుమార్పు ప్రతిపాదనకు ఇవాళ కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపే అవకాశం ఉంది. కాగా పేరు మార్పుపై కేంద్రం అనుమతి కోసం కేరళ అసెంబ్లీ ఇప్పటికే పలుమార్లు తీర్మానాలు చేసింది. ఈ నేపథ్యంలో ఇవాళ్టి క్యాబినెట్ భేటీలో కేరళ పేరుమార్పు ప్రతిపాదనకు ఆమోదముద్ర పడుతుందని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. కేరళ పేరు మార్పుపై 2023లో కూడా రాష్ట్ర అసెంబ్లీ తీర్మానం చేసి పంపింది. తమ రాష్ట్రం పేరును పూర్వం నుంచే మలయాళంలో 'కేరళమ్' అని పిలిచేవారని ఆ తీర్మానంపై చర్చలో ముఖ్యమంత్రి పినరయి విజయన్ గుర్తుచేశారు. రాష్ట్రం పేరు మార్పు విషయంలో విజయన్ ప్రభుత్వానికి బీజేపీ మద్దతు తెలిపింది. ఈ మేరకు ఇటీవల ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాజీవ్ చంద్రశేఖర్ సీఎంకు లేఖ రాశారు. ఆ లేఖకు సీఎం బదులిస్తూ.. 'రాష్ట్రం అసలు పేరు కేరళమ్. కానీ బ్రిటిషర్లు తమ సౌకర్యం కోసం కేరళగా మార్చారు. వారు చేసిన మార్పులను రాష్ట్ర సంస్కృతికి అనుగుణంగా సరిదిద్దుతున్నాం' అని పేర్కొన్నారు. కేరళ పేరు మార్పు ప్రతిపాదనకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం లభిస్తే.. ఇక రాజ్యాంగ ప్రక్రియ ప్రారంభం అవుతుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ప్రకారం రాష్ట్రం పేరును 'కేరళమ్'గా సవరించాల్సి ఉంటుంది. రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్‌లో పేర్కొన్న అన్ని భాషల్లో ఈ మార్పులు చేయాల్సి ఉంటుంది.

# వైరాలో భారీగా డ్రగ్స్ పట్టివేత..

ఖమ్మం, ఫిబ్రవరి 24:ఖమ్మం జిల్లా వైరాలో భారీగా డ్రగ్స్ పట్టుబడింది. ఒడిశా నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా రవాణా అవుతున్న 101.2 కిలోల ఎండు గంజాయితో పాటు 2.7 కిలోల హాషీష్ ఆయిల్‌ను పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం ఖమ్మం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ అనుమాస్పదంగా ఉన్న హర్యానా నెంబర్ ప్లేట్ కలిగిన కారును ఆపి చెక్ చేసింది. తనిఖీల్లో గంజాయి, హ్యాషిష్ ఆయిల్ బయటపడింది. ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌కు చెందిన మహమ్మద్ అస్లాంను పోలీసులు అరెస్ట్ చేశారు. కారు, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. వైరా ఎక్సైజ్ స్టేషన్‌కు నిందితుడిని అప్పగించారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న మత్తు పదార్థాల విలువ సుమారు 67.20 లక్షల రూపాయలుగా తెలుస్తోంది.

# హైదరాబాద్‌లో కల్తీ టీ పౌడర్ రాకెట్ గుట్టు రట్టు చేసిన పోలీసులు..

హైదరాబాద్, ఫిబ్రవరి 24: హైదరాబాద్‌లో కల్తీ టీ పౌడర్ రాకెట్‌ను పోలీసులు ఛేదించారు. టాస్క్‌ఫోర్స్, వెస్ట్ జోన్ పోలీసులు సంయుక్తంగా దాడులు చేసి నిందితుడైన ఫతేనగర్ నివాసి జగన్నాథ్ బిష్ణోయ్‌ను అరెస్ట్ చేశారు. కోకోపీట్, బెల్లం నీరు, సింథటిక్ ఫుడ్ కలర్స్‌తో కల్తీ టీ పొడిని జగన్నాథ్ తయారు చేస్తున్నాడు.

ఒక కిలో టీ పౌడర్ తయారీ కోసం 50 గ్రా. కోకోపీట్ మిశ్రమం ఉపయోగిస్తున్నాడు. అలాగే సన్‌సెట్ ఎల్లో, టార్ట్రాజిన్ రంగులను వినియోగిస్తున్నాడు.

దాడులకు పాల్పడిన పోలీసులు నిందితుడి వద్ద నుంచి 120 కిలోల కలర్ మిక్స్‌డ్ టీ పౌడర్‌ను స్వాధీనం చేసుకున్నారు. అలాగే 30 కిలోల నేచురల్ టీ పౌడర్, 138 కిలోల కోకోపీట్ మిక్స్, 800 గ్రా. సన్‌సెట్ కలర్, 700 గ్రా. టార్ట్రాజిన్ స్వాధీనం చేసుకున్నారు. జగన్నాథ్ ఈ కల్తీ టీ పౌడర్‌ను స్థానిక టీ స్టాల్స్, డీలర్లకు అధిక ధరకు సరఫరా చేస్తున్నాడు.

# ఇంటర్ మీడియేట్ ఎస్.ఎస్.సి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఐదు నిమిషాల వరకు అనుమతి



హైదరాబాద్ , ఫిబ్రవరి 24 (ఎక్స్ప్రెస్ న్యూస్ ); : రాష్ట్రంలో జరుగనున్న ఇంటర్ మీడియేట్ ఎస్.ఎస్.సి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ప్రరీక్ష ప్రారంభం తర్వాత ఐదు నిమిషాల వరకు హాజర య్యేందుకు అనుమతినిస్తున్నట్టు ప్రభుత్వం తెలిపింది. ఇంటర్, పదవ తరగతి పరీక్షల నిర్వహణపై రాష్ట్రంలోని జిల్లా కలెక్టర్లు, ఎస్.పీ లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు నేడు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య , పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ లు ఈ వీడియో కాన్ఫరెన్స్ కు హాజరయ్యారు. ఈ సందర్భంగా సి.ఎస్ రామకృష్ణా రావు మాట్లాడుతూ , ఫిబ్రవరి 25 వ తేదీ నుండి ఇంటర్ పరీక్షలు మార్చి 14వ తేదీ నుండి పదవ తరగతి పరీక్షలు ప్రారంభమవుతున్నాయని, ఈ పరీక్షల నిర్వహణలో ఏవిధమైన అవకతవకలు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్లను ఆదేశించారు. ఈసారి పరీక్షలకు నిర్ణీత సమయానికన్నా ఐదు నిమిషాల తర్వాత కూడా పరీక్ష కేంద్రాలకు విద్యార్థులను అనుమతిస్తూ నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేశారు. ప్రతీ పరీక్ష కేంద్రం వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని , గతంలో ఉన్న వివాదాస్పద పరీక్షా కేంద్రాలపై మరింత విజిలెన్స్ గా ప్రత్యేక దృష్టి సాధించాలని అన్నారు. ప్రతీ పరీక్ష కేంద్రంలో కనీస సౌకర్యాలైన తాగునీరు, విద్యుత్, టాయిలెట్ ల సౌకర్యాలు కల్పించడంతో పాటు సి.సి టీవీ లను ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రతీ కేంద్రం లో ఒక ఏ.ఎన్.ఎం , ఫస్ట్ ఎయిడ్ కిట్ లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఏ ఒక్క విద్యార్థి కూడా నేలపై కూర్చొని పరీక్ష రాయకూడదని అన్ని కేంద్రాలలో బెంచీలు ఏర్పాటు చేయాలని అన్నారు. పరీక్షల నిర్వహణలో పోలీస్, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో సమన్వయంతో పనిచేయాలన్నారు. విద్యా శాఖ అధికారులు కాకుండా ఇతర శాఖల అధికారులతో సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ లను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. రాష్ట్ర విద్య శాఖ కార్యదర్శి యోగితా రాణా మాట్లాడుతూ, ఈ సారి ఇంటర్ పరీక్షలకు 4,89,055 మంది ఫస్ట్ ఇయర్ కు 4,53,832 మంది విద్యార్థులు సెకండ్ ఇయర్ కు హాజరవుతున్నారని అదేవిధంగా 5,28,2 39 మంది పదవ తరగతి పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. పరీక్షా కేంద్రాలకు సెల్ ఫోన్ లు ఇతర ఎలక్ట్రానిక్ గాడ్జెట్ లను అనుమతించడం లేదని కేవలం పరీక్ష కేంద్రం ఛీఫ్ సూపరింటెండెంట్ కు మాత్రమే ఎమర్జెన్సీ పరిస్థితులలో ఉపయోగించడానికి సెల్ ఫోన్ ను అనుమతిస్తున్నట్టు తెలిపారు. ప్రతీ కేంద్రం వద్ద మొదటి సారిగా క్లోక్ రూమ్ లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఏపరీక్షా కేంద్రంలో నైనా ఏవిధమైన అవకతవకలకు పాల్పడితే సంబంధిత అధికారులు, సిబ్బంది పై కఠిన చర్యలు చేపట్టనున్నట్టు హెచ్చరించారు. ప్రతీ పరీక్ష ప్రశ్న పత్రానికి ప్రత్యేకంగా ఖి.ఖీ కోడ్, సీరియల్ నెంబర్ ఉంటుందని పరీక్ష ప్రారంభానికి 15 నిమిషాల ముందుగా మాత్రమే ప్రశ్నా పత్రాలను ఓపెన్ చేయాలని స్పష్టం చేసారు. ఈసారి మొదటి సారిగా విద్యార్థుల హాల్ టికెట్లను వాట్సాప్ ద్వారా పంపడమే కాకుండా వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకునే సౌకర్యాన్ని కల్పించామని వెల్లడించారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్లను ఆదేశించారు.

## పాలు కలుషితం అవడానికి కారణం ఏంటో చెప్పిన డీఎస్పీ దేవకుమార్..

అమరావతి, ఫిబ్రవరి 24: రాజమండ్రి కల్తీ పాల ఘటనపై విచారణ అధికారి కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ విచారణ చేపట్టారు. పాల వ్యాపారి అడ్డాల గణేష్ నిర్వహిస్తున్న వరలక్ష్మి డెయిరీని సీజ్ చేశారు. డీఎస్పీ దేవకుమార్ ఏబీఎన్‌తో మాట్లాడుతూ.. పాల వ్యాపారి గణేష్‌పై క్రైమ్ నెంబర్ 90/2026 కేసు నమోదు చేశామని తెలిపారు. నిందితుడిపై 105, 275 బీఎన్ఎస్ సెక్షన్లు నమోదు చేశామని వెల్లడించారు. పాల వ్యాపారి గణేష్ వరలక్ష్మి మిల్క్ డెయిరీని అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నాడని అన్నారు. ఆర్థిక ఇబ్బందులు, లాభాపేక్షతో పాలల్లో నీళ్లు కలిపి ప్రజలకు పోసేవాడని చెప్పారు.

ఈ నెల 14వ తేదీన పాలు తక్కువగా సేకరించడం వల్ల పాలు చిక్కగా కనిపించేందుకు యూరియా, డిటర్జెంట్ పొడి, నూనె వంటి పదార్థాలు కలిపి కల్తీ చేశాడన్నారు. కల్తీ చేసిన పాలను ఫ్రిజ్‌లో నిల్వ చేయడం వల్ల కూలెంట్ ఆయిల్ లీకై పాలు కలుషితమయ్యాయని తెలిపారు. అందువల్లే పాలు చేదుగా ఉన్నాయన్నారు.


ఐదుకు చేరిన మృతుల సంఖ్య..

కల్తీ పాల ఘటనలో మృతుల సంఖ్య ఐదుకు చేరింది. ఆదివారం వరకు ఇద్దరు మృతి చెందగా.. సోమవారం మరో ముగ్గురు చనిపోయారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాధాకృష్ణమూర్తి, ఎన్ శేషగిరిరావు, తాడి రమణి మృతి చెందారు. మరికొంం తమంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై ఏపీ వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ వీర పాండ్యన్ స్పందించారు. ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారి ఖర్చులను ఏపీ ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేశారు. అనుమానిత లక్షణాలు ఉన్నవారు వైద్యులను వెంటనే సంప్రదించాలని వీర పాండ్యన్ సూచించారు.

## మావోయిస్టు అగ్రనేత గణపతి ఆచూకీ లభ్యం

హైదరాబాద్, ఫిబ్రవరి 24: కొన్ని దశాబ్దాల పాటు మావోయిస్టు పార్టీని నడిపించిన అగ్రనేత గణపతి అలియాస్ ముప్పాళ్ల లక్ష్మణ రావు ఆచూకీ లభ్యమైంది. గత కొన్నేళ్లుగా భారత్ పొరుగునున్న నేపాల్‌లో ఆయన మకాం వేశారు.

తీవ్ర అనారోగ్యంతో ఆయన బాధపడుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఆయన నడవలేని పరిస్థితిలో ఉన్నారు. అయితే గణపతిని భారత్‌కు రప్పించేందుకు తెలంగాణ పోలీసులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. వృద్ధాప్యం కారణంగా మావోయిస్టు పార్టీ కార్యదర్శి పదవిని గణపతి వదిలిపెట్టిన సంగతి తెలిసిందే.

# భారత నావికాదళ దౌత్య విధానానికి పరాకాష్ట 'అభ్యాస మిలన్-2026'

**(భారత నావికాదళం 15 - 25 ఫిబ్రవరి 2026 వరకు నిర్వహిస్తున్న "ఎక్సర్‌సైజ్ మిలన్ 2026" శుభ సందర్భంగా)**

భారత నావికాదళం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 13వ ఎడిషన్ "ఎక్సర్‌సైజ్ మిలన్ 2026"కు ఏపీలోని విశాఖపట్నం వేదిక కావడం మన తెలుగు వారికి హర్షదాయకం. అంతర్జాతీయ నౌకాదళ సమీక్షతో పాటు 72కు పైగా దేశాలు, 60కి పైగా యుద్ధనౌకలతో కూడిన కాన్‌క్లేవ్ "మిలన్ 2026"కు ప్రత్యేకం. భారత నావికాదళం ఫిబ్రవరి 15 - 25, 2026 వరకు విశాఖ రేవులో జరుగుతున్న 13వ ఎడిషన్ "ఎక్సర్‌సైజ్ మిలన్ 2026" ద్వారా మహాసాగర్ దార్శనికత కింద భారతదేశ నావికా దౌత్య విధానానికి పరాకాష్టను సూచిస్తున్నది ఈ మహా వేదిక. ఫిబ్రవరి 2026 మాసం ప్రపంచ సముద్ర నావికా సమాజానికి చారిత్రాత్మక నెలగా గుర్తుండిపోతుంది. ఈ విన్యాసం ద్వారా అంతర్జాతీయ నావికా దళాల కామ్రేడరీ, సమన్వయం, సహకారం లాంటి అంశాలపై దృష్టి సారించబడుతున్నది. ఇండో-పసిఫిక్ ప్రాంత సముద్ర జలాల్లో జలాంతర్గామి యుద్ధ వ్యతిరేకత, గగన రక్షణ, సముద్ర భద్రతలను కూడా నొక్కి చెప్పడం జరుగుతుంది.

అభ్యాస మిలన్ 2026 మహోన్నత లక్ష్యాలు :

అభ్యాస మిలన్ 2026 కేవలం ఒక ఉత్సవం మాత్రమే కాదు, ఇది ఒక అధిక తీవ్రత కలిగిన కార్యాచరణ ప్రయోగశాల. అమెరికా, రష్యా, జపాన్, ఆస్ట్రేలియా వంటి విభిన్న నావికాదళాలు ఒకే చోట సంఘటిత శక్తిగా పని చేయగల సామర్థ్యాన్ని పరీక్షించడం అనే మహత్తర లక్ష్యాన్ని తీసుకున్నారు. సముద్ర జలాలపై ఆధునిక యుద్ధ శిక్షణలో భాగంగా లైవ్-ఫైర్ డ్రిల్, యాంటీ-సబ్‌మెరైన్ వార్‌ఫేర్, సంక్లిష్ట ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ విన్యాసాలు కూడా ప్రదర్శించబడుతున్నాయి. పైరసీ, డ్రోన్ సమూహాలు, సముద్ర ఉగ్రవాదం లాంటి సాంప్రదాయేతర సవాళ్లకు సమిష్టిగా సమాధానాలు అన్వేషించడం జరుగుతుంది. శోధన, రక్షణ, విపత్తు సహాయ ప్రోటోకాల్స్ క్రమబద్ధీకరణకు నిపుణుల అభిప్రాయ మార్పిడి కూడా లక్ష్యంగా తీసుకోబడింది.

అభ్యాస మిలన్ 2026లో పాల్గొనాల్సిందిగా 135 దేశాలకు ఆహ్వానాలు పంపించగా 72 దేశాలు పాల్గొంటున్నాయి. భారత నావికాదళం మిలన్ 2026లో భాగంగా తూర్పు నావల్ కమాండ్‌లో "మిలన్ విలేజ్"ను కూడా ప్రారంభించడం ముదావహం. బంగాళాఖాతం నేడు 60కి పైగా యుద్ధనౌకల నిలయంగా మారిన అపురూప సందర్భం ఇది. భారతదేశం స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన విమాన వాహన నౌక ఐఎన్ఎస్ విక్రాంత్, డిస్ట్రాయర్లు, స్టెల్త్ ఫ్రిగేట్లు లాంటివి ప్రదర్శనలో ప్రధాన ఆకర్షణగా నిలువనున్నాయి. వీటితో పాటు వివిధ దేశాల అత్యాధునిక నావికాదళ సామర్థ్యాలకు కూడా వేదిక అవుతున్నది. మన దేశ భద్రతలో నిరంతరం డేగ కన్నేసి కాపాడుతున్న నావికా, గగన, ఆర్మీ దళాల సేవలను గుర్తిస్తూ వారందరికీ మన కృతజ్ఞతలు తెలియజేద్దాం. జై జవాన్ జై కిసాన్ అంటూ దిక్కులు పిక్కటిల్లేలా గొంతులు కలుపుదాం.



-ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# హెల్మెట్ స్ట్రాప్ బిగిస్తేనే పూర్తి రక్షణ

**-డీసీపీ షరీన్ బేగం**

విజయవాడ, ఫిబ్రవరి 24: ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్ వి రాజశేఖర్ బాబు ఆదేశాల మేరకు ట్రాఫిక్ డీసీపీ షరీన్ బేగం పర్యవేక్షణలో హెల్మెట్ల పై ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహిస్తున్న విషయము తెలిసినదే. ఈ క్రమంలో, సత్యనారాయణపురం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ కే కిషోర్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన హెల్మెట్ అవగాహన ఫ్లాష్ మాబ్ కార్యక్రమంలో ట్రాఫిక్ డీసీపీ షరీన్ బేగం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆవెు మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా ప్రాణనష్టం తలకు గాయాల వల్లనే జరుగుతుందని పేర్కొన్నారు.

హెల్మెట్ కేవలం జరిమానా తప్పించుకునేందుకు కాదు, ప్రాణాలను కాపాడుకోవడానికి ధరించాలని, హెల్మెట్ ధరించడం మాత్రమే సరిపోదు, దాని స్ట్రాప్‌ను సక్రమంగా పెట్టుకోవాలని. అప్పుడు మాత్రమే ప్రమాద సమయంలో పూర్తి రక్షణ లభిస్తుందని ఆమె అన్నారు అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడవడం వల్ల అమాయకుల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయని, యువత ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోలీసుల లక్ష్యం కేసులు నమోదు చేయడం కాదని, ప్రజల్లో బాధ్యతా భావం పెంపొందించడం అని చెప్పారు.

ఆదిత్య కళాశాల విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి హెల్మెట్ ధరించి ఫ్లాష్ మాబ్ నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించి రోడ్డు ప్రమాదాల నివారణలో భాగస్వాములు కావాలని డీసీపీ షరీన్ బేగం పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో , ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామారావు, మహిళా ఎస్ఐ సరళ, పోలీసు సిబ్బంది, ఆదిత్య కళాశాల ప్రిన్సిపాల్ వీర్రాజు, నృత్య రూపకర్త స్వామి, ఆదిత్య కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



# చిన్నారులు, కుటుంబ కథా విభాగంలో బాఫ్టా పురస్కారాన్ని గెలుచుకున్న 'బూంగ్' చిత్ర బృందానికి ప్రధాని అభినందన.

న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 24: ఈ బాఫ్టా చలనచిత్ర పురస్కారాల్లో.. చిన్నారులు, కుటుంబ కథా విభాగంలో విజేతగా 'బూంగ్' చిత్రాన్ని బ్రిటిష్ ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఆర్ట్స్ (బాఫ్టా) అకాడమీ ప్రకటించింది.

ఈ బాఫ్టా పురస్కారాల్లో చిన్నారులు, కుటుంబ చలనచిత్ర విభాగంలో విజేతగా నిలిచిన 'బూంగ్' చలనచిత్ర బృందం మొత్తానికీ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ విజయం అత్యంత ఆనందకరమనీ, ముఖ్యంగా మణిపూర్‌కు ఇదెంతో ప్రత్యేకమైందనీ శ్రీ మోదీ అన్నారు. దేశంలో సృజనాత్మకతకు కొదవ లేదని ఈ పురస్కారం ద్వారా స్పష్టమవుతోందని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు.

బాఫ్టా ప్రకటనను ప్రస్తావిస్తూ, సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో బాఫ్టా చేసిన ఓ పోస్టుపై స్పందిస్తూ.. శ్రీ మోదీ ఇలా పేర్కొన్నారు.

"ఈ చిత్ర బృందం మొత్తానికీ శుభాకాంక్షలు. ఇది ఎంతో ఆనందకరమైన క్షణం. ముఖ్యంగా మణిపూర్‌కు ఇదెంతో ప్రత్యేకమైనది. దేశంలో సృజనాత్మక ప్రతిభకు కొదవ లేదని ఇది స్పష్టం చేస్తోంది."

# రాజాజీ ఉత్సవాన్ని భారత రాష్ట్రపతి నిర్వహించడం ప్రశంసనీయం: ప్రధానమంత్రి

న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 24: రాష్ట్రపతి భవన్‌లోని అశోక్ మండపం సమీపంలో గ్రాండ్ ఓపెన్ మెట్ల వద్ద ఏర్పాటు చేసిన చక్రవర్తి రాజగోపాలాచారి విగ్రహాన్ని భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము ఆవిష్కరించారు.

దేశ భవిష్యత్తును తీర్చిదిద్దిన వారిని గౌరవించుకోవడం, వలసవాద మనస్తత్వ భావాలను తొలగించుకోవడమనే భారత్ సంకల్పాన్ని ప్రతిబింబించిన ఈ కార్యక్రమం ప్రశంసనీయమైన ప్రయత్నంగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అభివర్ణించారు. రాజాజీని మహోన్నత పండితుడిగా, స్వాతంత్ర్య సమరయోధుడిగా, ఆలోచనాపరుడిగా, పరిపాలనా దక్షుడిగా అని ఆయన శ్లాఘించారు. ఆయన జీవితం సమగ్రత, మేధస్సు, దేశం పట్ల అచంచల నిబద్ధతలను మూర్తీభవించినదని శ్రీ మోదీ అన్నారు.

రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన 'రాజాజీ ఉత్సవ్'లో భారత రాష్ట్రపతి పాల్గొన్నారు. రాజాజీ ఉత్సవ్‌లో భాగంగా ఫిబ్రవరి 24 నుంచి మార్చి 1వ తేదీ వరకు రాష్ట్రపతి భవన్‌లో రాజాజీ జీవితం, దేశ సంక్షేమం కోసం ఆయన చేసిన కృషిపై ప్రదర్శన నిర్వహిస్తున్నారు.

రాజాజీ దేశానికి చేసిన గొప్ప సేవలకు సంబంధించిన విభిన్న అంశాలను వెలుగులోకి తెచ్చే అద్భుతమైన కార్యక్రమంగా రాజాజీ ఉత్సవ్‌ను ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అభివర్ణించారు. ఈ ప్రదర్శనను సందర్శించి ఆయన జీవితం, ఆదర్శాల నుంచి స్ఫూర్తి పొందాలని ప్రధానమంత్రి ప్రజలను కోరారు.

పైన పేర్కొన్న కార్యక్రమాల గురించి భారత రాష్ట్రపతి 'ఎక్స్' వేదికగా చేసిన పోస్టులకు ప్రతిస్పందిస్తూ, శ్రీ మోదీ ఇలా పేర్కొన్నారు:

"ఇది మన భవితను రూపొందించిన వారిని గౌరవించాలనే, వలసవాద మనస్తత్వ భావాలను తొలగించాలనే భారత్ సంకల్పాన్ని ప్రతిబింబించే ప్రశంసనీయమైన ప్రయత్నం.

"రాజాజీ గొప్ప పండితులు, స్వాతంత్ర్య సమరయోధులు, ఆలోచనాపరులు, పరిపాలనా దక్షులు. ఆయన జీవితం సమగ్రత, మేధస్సు, దేశం పట్ల అచంచలమైన నిబద్ధతలను మూర్తీభవించినది."

"రాజాజీ ఉత్సవ్ ఒక అద్భుతమైన కార్యక్రమం. ఇది మన దేశ సంక్షేమం కోసం రాజాజీ చేసిన గొప్ప కృషిలోని విభిన్న అంశాలను వెలుగులోకి తెస్తుంది. మీరంతా దీనిని సందర్శించి స్ఫూర్తి పొందాలని నేను కోరుతున్నాను!"

# హైదరాబాద్‌లో 'ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్' (ఎఫ్‌డీడీఐ) 5వ స్నాతకోత్సవ వేడుకలు

న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 24: ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ (ఎఫ్‌డీడీఐ) 5వ స్నాతకోత్సవ వేడుకలను హైదరాబాద్‌లో నిర్వహించారు. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేంద్ర మంత్రి తన స్నాతకోత్సవ ప్రసంగంలో తయారీ, ఆవిష్కరణలు, నైపుణ్యా భివృద్ధిలో భారత్ సాధించిన పురోగతిని ప్రధానంగా ప్రస్తావించారు.

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎమ్ఎస్ఎమ్ఈల) ఉపాధి కల్పన, ఎగుమతులు, వృద్ధికి పాదరక్షలు-తోలు రంగం అందించే సహకారాన్ని ఆయన గుర్తించారు. భారత ప్రపంచ స్థాయి సామర్థ్యాన్ని బలోపేతం చేయడం కోసం సాంకేతికత, సుస్థిరత, డిజైన్ ఆవిష్కరణలను స్వీకరించాలని గ్రాడ్యుయేషన్ విద్యార్థులను ఆయన ప్రోత్సహించారు.

ఎఫ్‌డీడీఐ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ వివేక్ శర్మ (ఐఆర్ఎస్) మాట్లాడుతూ కోర్సు పూర్తి చేసుకున్న గ్రాడ్యుయేట్లను అభినందించారు. ప్రపంచవ్యాప్తంగా సమర్థులైన నిపుణులను అభివృద్ధి చేయడంలో సంస్థ నిబద్ధతను పునరుద్ఘాటించారు. విద్యార్థులు తమ వృత్తిపరమైన ప్రయాణంలో ఆవిష్కరణలు, సుస్థిరత, నైతిక విలువలతో కూడిన పద్ధతులు, డిజైన్ సంబంధిత ఆలోచనలతో ముందుకు సాగాలని ఆయన కోరారు.

ఈ వేడుకలు ఎఫ్‌డీడీఐ-హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ తేజ్ లోహిత్ రెడ్డి (ఐఏఎస్) స్వాగత ప్రసంగంతో ప్రారంభమయ్యాయి. 2018లో హైదరాబాద్ క్యాంపస్ ఏర్పాటు నుంచి సాధించిన వృద్ధిని ఆయన వివరించారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అభివృద్ధి, ఆధునిక ప్రయోగశాలలు, బలోపేతమైన పరిశ్రమ సహకారాలను ఆయన ప్రధానంగా ప్రస్తావించారు. 2025 బ్యాచ్‌లో ఫ్యాషన్ డిజైన్, ఫుట్‌వేర్ డిజైన్, లెదర్ గూడ్స్, యాక్సెసరీస్ డిజైన్, మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌ల నుంచి 72 మంది విద్యార్థులు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్నారు.

అసమాన విద్యా నైపుణ్యాలతో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారు, వెండి పతకాలను ప్రదానం చేశారు. ప్రముఖులు, అధ్యాపకులు, పరిశ్రమ ప్రతినిధులు, తల్లిదండ్రుల సమక్షంలో స్నాతకోత్సవ ప్రతిజ్ఞ అనంతరం పట్టభద్రులకు డిగ్రీలను ప్రదానం చేశారు.

నైపుణ్యాభివృద్ధి, పరిశోధన, ఆవిష్కరణలు, పరిశ్రమ భాగస్వామ్యం ద్వారా పాదరక్షలు, తోలు, ఫ్యాషన్, రిటైల్ వ్యవస్థలకు ఎఫ్‌డీడీఐ దోహదపడుతూనే ఉందని వక్తలు పేర్కొన్నారు. డిజైన్, తయారీలో సుస్థిర పద్ధతులను, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను, ప్రపంచ ప్రమాణాలకు కట్టుబడి ఉండుటను ప్రోత్సహించడంపై ఈ సంస్థ ప్రధానంగా దృష్టి సారించింది.

# డబ్బులు ఇస్తే ఉద్యోగాలు రావు ..

**-కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్**

కర్నూల్, ఫిబ్రవరి 24: ఏ ప్రభుత్వ, ప్రవేట్ ఉద్యోగాలు కూడా మధ్యవర్తుల ద్వారా రావు. నిరుద్యోగ యువత దళారుల మాటలు నమ్మి, డబ్బులు ఇచ్చి, మోస పోవద్దు. నిరుద్యోగ యువత మోసాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలి. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి కొందరు వ్యక్తులు నిరుద్యోగ యువత నుండి డబ్బులు తీసుకొని మోసాలు చేస్తున్నారనే ఫిర్యాదులు ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందుతున్నట్లు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మంగళవారం తెలిపారు.

ఈ సంధర్భంగా కర్నూలు ఎస్పీ మాట్లాడుతూ ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ లో ఉద్యోగాలు, కోర్టులో ఉద్యోగాలు, స్టాఫ్ నర్స్, ఫీల్డ్ అసిస్టెంట్, సాఫ్ట్ వేర్ జాబ్స్, బ్యాంకులలో ఉద్యోగాలు, ఫుడ్ కార్పోరేషన్, విద్యుత్ శాఖ, అగ్రికల్చర్, రెవిన్యూ శాఖ, ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ లలో జూనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్, క్లర్క్



అంటూ పలు రకాల ఉద్యోగాల పేరుతో వివిధ రకాలుగా దళారులకు డబ్బులు ఇచ్చి యువత మోసపోతూనే ఉన్నారన్నారు.

అమాయకులను లక్ష్యంగా ఎంచుకుని కొందరు మోసాలకు పాల్పడుతున్న నటువంటి సంఘటనల పై కేసులు నవెూదు అవుతూనే ఉన్నాయన్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించే వారికి ఇంకా డబ్బులు ఇచ్చి మోసపోతూనే ఉన్నారన్నారు. ఎక్కడైనా, ఎవరైనా ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి డబ్బులు వసూలు చేసే వారి సమాచారాన్ని స్థానిక పోలీసు స్టేషన్ లలో లేదా డయల్ 112 కు గాని లేదా డయల్ 100 కు గాని ముందుగానే ఫిర్యాదు చేసి తెలియజేయాలన్నారు.

ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేసే వారిపై కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఉద్యోగాల పేరుతో మోసపోతున్న ఫిర్యాదులు ఎక్కువగా అవుతున్నాయన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు కేవలం పోటీ పరీక్షలు మరియు ప్రతిభ ఆధారంగానే లభిస్తాయని , ఎవరైనా మధ్యవర్తులు డబ్బులు తీసుకుని ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పడం పూర్తిగా మోసపూరితమన్నారు. ప్రైవేట్ రంగంలో కూడా అర్హతలు, నైపుణ్యాలు మరియు ఎంపిక విధానాల ప్రకారమే నియామకాలు జరుగుతాయన్నారు. యువత మోసపోవద్దని హెచ్చరించారు.

**కర్నూలు ఎస్పీ ప్రజలకు సూచనలు**

ఉద్యోగాల పేరుతో ఎవరికి కూడా డబ్బులు చెల్లించవద్దు. అధికారిక నోటిఫికేషన్లు మాత్రమే నమ్మాలి. అనుమానాస్పద కాల్స్, మెసేజ్‌లు వచ్చినప్పుడు వెంటనే పోలీసులకు తెలియజేయాలి. యువత తమ ప్రతిభపై నమ్మకం ఉంచుకుని కష్టపడి చదివి పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని, మోసగాళ్ల వలలో పడకుండా అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ గారు విజ్ఞప్తి చేశారు. ఉద్యోగాల పేరుతో దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని, డబ్బులు ఇచ్చి నష్టపోవద్దని పోటీ పరీక్షలు, ప్రతిభ ఆధారంగానే ఉద్యోగాలు వస్తాయని ఈ సంధర్బంగా కర్నూలు జిల్లా యువతకు, విద్యార్థులకు, జిల్లా ప్రజలకు కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ విజ్ఞప్తి చేశారు.

# వారు ఒప్పుకుంటే ఇంత రచ్చ ఉండదు

అమరావతి, ఫిబ్రవరి 24: కల్తీ నెయ్యి వ్యవహారంలో దోషులు ఎవరున్నా శిక్ష పడాల్సిందేనని జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై అసెంబ్లీలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ? లడ్డూకోసం వినియోగించిన నెయ్యిలో నెయ్యే లేదన్నారు. కల్తీ పై గత పాలకులు ఒప్పుకుంటే ఇంత రచ్చ ఉండదన్నారు.

కెమికల్స్ నుంచి నెయ్యి తీయొచ్చని వాళ్లు నిరూపించారన్నారు. బాధ్యులపై గత పాలకమండలి చర్యలు తీసుకుని ఉండాల్సిందన్నారు. నచ్చిన సంస్థలకు టెండర్ల కోసం నిబంధనలు మార్చారన్నారు. ఇలాంటి తప్పు మరో మతంలో జరిగితే గగ్గోలు పెట్టేవారన్నారు.

కల్తీ నెయ్యిలో ఏ రసాయనాలు వాడారో ఆ పెరుమాళ్లకే తెలియాలన్నారు. జంతు సంబంధిత రసాయనాలు ఉన్నాయని ఎన్‌డీడీబీ రిపోర్టు చెప్పిందన్నారు.

అది నెయ్యే కాదని సీబీఐ రిపోర్టు ఇచ్చిందన్నారు. ఇది వెంకటేశ్వర స్వామికి కాకుండా వేరే ఏ మతానికి జరిగినా ప్రపంచమంతా గగ్గోలు పెట్టేదన్నారు.

# మార్చి 8న మహా కుంభాభిషేకం..

అమరావతి, ఫిబ్రవరి 24: విజయవాడలోని శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న ప్రఖ్యాత శక్తి క్షేత్రంలో కుంభాభిషేక మహోత్సవం-2026ను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జోరుగా కొనసాగుతున్నాయి.

దేశవ్యాప్తంగా ప్రసిద్ధిగాంచిన ఈ దేవస్థానం ఆధ్యాత్మిక ప్రాముఖ్యతతో పాటు శాస్త్రోక్త సంప్రదాయాలకు నిలయంగా ఈ కుంభాభిషేకం నిలుస్తోంది.

పూర్వం కీలుడనే యక్షుడు అమ్మవారిని తన హృదయంలో కొలువై ఉండాలని కోరగా, అమ్మవారు అతడిని పర్వతరూపంలో (కీలాద్రి) ఉండమని వరమిచ్చినట్లు స్థల పురాణం చెబుతోంది. దుర్గమాసురుడిని సంహరించిన అనంతరం ఆదిపరాశక్తి ఇక్కడ స్వయంభువుగా అవతరించింది. జగద్గురు ఆది శంకరాచార్యులు అమ్మవారి ఉగ్రరూపాన్ని శాంతస్వరూపిణిగా మార్చేందుకు శ్రీచక్ర ప్రతిష్ఠాపన చేసి శ్రీసూక్త ఆర్చన విధానాన్ని ప్రవేశపెట్టారు. ఇదే క్షేత్రంలో అర్జునుడు తపస్సు చేసి పాశుపతాస్త్రాన్ని పొందగా, పంమేశ్వరుడు శ్రీ మల్లేశ్వర స్వామిగా ఆవిర్భవించినట్లు విశ్వాసం.

ఆగమ శాస్త్ర ప్రకారం ప్రతి 12 ఏళ్లకు ఒకసారి ఆలయంలో దైవిక శక్తిని పునరుద్ధరించేందుకు కుంభాభిషేకం నిర్వహించడం అనివార్యం. ఆలయ గోపురంపై కలశంలో విష్ణువు, శివుడు, బ్రహ్మ మరియు మాతృదేవతలు స్థితిచేస్తారని విశ్వాసం. పుణ్యనదులు, తీర్థాలు, సప్త సముద్ర జలాలతో కలశాలను నింపి యాగశాలలో మంత్రోచ్ఛారణలతో పూజించి, ఆలయ శిఖరంపై అభిషేకం చేయడమే కుంభాభిషేకంగా భావిస్తారు.

# వైసీపీలో ఆక్రమణ.. టీడీపీతో న్యాయం

**-రాష్ట్ర డైరెక్టర్ ఎన్.సీ పరమేశ్వర్**

అమరావతి, ఫిబ్రవరి 24: ప్రతి గ్రామంలోనూ రైతులు ప్రజల బట్టలు ఉతకటానికి రజకులకు దోబీ ఘాట్ భూమిని బ్రిటిష్ కాలంలోనే కేటాయించారు.అయితే కొన్ని గ్రామాల్లో ఇప్పటికీ ఆ భూములు పెత్తందార్ల దౌర్జన్యకారులు చేతుల్లోనే ఉన్నాయని ఆ దోబీ ఘాట్ భూములు విడిపించి రజకులకు న్యాయం చేయాలని రాష్ట్ర రజక కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఎన్.సీ పరమేశ్వర్ పేర్కొన్నారు.రాప్తాడు మండలం యర్రగుంట గ్రామంలోని సర్వే నంబర్ 169లో 9-36 సెంట్లు భూమి రజకుల దోబీ ఘాట్ కు తిరిగి ఇవ్వాలని అనంతపురం ఆర్డీవో కేశవ నాయుడు రాప్తాడు తాసిల్దార్ విజయకుమారి కి ఆదేశాలు ఇచ్చారు.

ఆదేశాల కాఫీ పేపర్లను రాప్తాడు మండల తాసిల్దార్ విజయకుమారి రజక సంఘం నాయకులకు అందజేశారు.ఈ సంధర్భంగా రాష్ట్ర రజక సంఘం కార్పొరేషన్ డైరెక్టర్ ఎన్.సి పరమేశ్వర్ మాట్లాడుతూ యర్రగుంట గ్రామంలో రెండు తరాలుగా 12 రజక కుటుంబాలు గ్రామంలోని రైతులు ప్రజల బట్టలు ఉతుకుతూ జీవిస్తున్నాం. కొన్ని సంవత్సరాల క్రితమే గ్రామ పంచాయతీ రజకులు బట్టలు ఉతకడానికి గ్రామంలోని సర్వే నంబర్ 169లో 9-36 సెంట్లు భూమి దోబీ ఘాట్ కు కేటాయించింది.అప్పటినుండి గ్రామంలోని రజకులు బట్టలు అక్కడే ఉతుకుతూ రైతులకు ప్రజలకు సేవ చేస్తూ తమ కుటుంబాలను పోషించుకుంటూ జీవిస్తున్నారు.

వైసిపి ప్రభుత్వం హయాంలో మండల వ్యవసాయ కమిటీ చైర్మన్ (ప్రస్తుతం మాజీ) కేశవరెడ్డికి ఆ దోభీ ఘాట్ భూమి పైన కన్ను పడింది.ఎలాగైనా రజకుల దోబీ ఘాట్ భూమిని సొంతం చేసుకోవాలనే దురుద్దేశంతో కుట్ర పన్ని రిటైర్డ్ అయినా ప్రభుత్వ అధికారులు మండలం నుంచి బదిలీ అయిన ప్రభుత్వ అధికారులతో కుమ్మక్కై ముగ్గురు పేర్లు మీద నకిలీ పట్టాలు నకిలీ పాస్ పుస్తకాలు తయారు చేయించుకుని ధోబి ఘాట్ ను దౌర్జన్యంగా అక్రమంగా సొంతం చేసుకున్నారు. వైసిపి ప్రభుత్వం హయాంలోనే ఈ నకిలీలు భూమి అక్రమణలు జరిగినాయి.

అప్పటి నుండి రజకులు రైతుల బోరు బావులు దగ్గర వంక పక్కన బట్టలు ఉతుకుతున్నారు.అలాగే ధోబి ఘాట్ భూమిని ఆక్రమించుకున్న అక్రమార్కుల పైన న్యాయపోరాటం చేస్తూనే ఉన్నారు. మళ్లీ ఎన్నికల హడావిడి మొదలైంది. అప్పుడు రాజకీయ పార్టీల ప్రచారంలో భాగంగా



టిడిపి పరిటాల సునీత గ్రామంలో ఎన్నికల ప్రచారం చేస్తున్నప్పుడు రజకుల ఐకమత్యంగా తమ సమస్యను చెప్పారు. అందుకు పరిటాల సునీత తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే మీకు తప్పకుండా న్యాయం చేస్తానని హామీ ఇచ్చింది.

అందులో భాగంగానే నేడు రజకుల ధోబి ఘాట్ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్చించి న్యాయం చేసిందని తెలిపారు.అందుకు రజకులు రాప్తాడు నియోజకవర్గ ఎమ్మెల్యే పరిటాల సునీతకు మండలం ఇన్చార్జి మురళికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.అలాగే ఆర్డీవో ఇచ్చిన ఆదేశాలను మీడియా ముందు ప్రవేశపెట్టారు. గ్రామంలో కూడా గ్రామసభ నిర్వహించి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టినప్పుడు గ్రామ రైతులు ప్రజలు కూడా రజకులకు మద్దతిస్తూ అండగా ఉంటామని సంతకాలు కూడా చేశారని తెలిపారు.

రజకుల దోబీ ఘాట్ ఆక్రమించుకుని నకిలీ పట్టాలు నకిలీ పాస్ పుస్తకాలు చేయించుకున్న కేశవరెడ్డి పైన చట్ట ప్రకారం కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రజక చైతన్య సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శిలు పక్కీరప్ప వెంకట రాముడు మండల అధ్యక్షులు కొత్తపల్లి నారాయణస్వామి నాయకులు నాగేంద్ర శివయ్య నరసింహులు క్రిష్టప్ప అశ్వర్థ నాగభూషణ నాగరాజు వన్నప్ప మంగమ్మ కళావతి ఉమాదేవి ముత్యాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

# అమెరికా యుద్ధ నౌకలో పని చేయని టాయిలెట్స్.. 5,000 మంది సైనికులకు కష్టాలు



న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 24: ఒకపక్క ఇరాన్‌పై అమెరికా దాడికి సిద్ధమవుతున్నట్లే కనిపిస్తోంది. అయితే, ఈ లోపు అమెరికా సైనికులకు ఒక చిక్కు వచ్చిపడింది. వారి యుద్ధ నౌకలో టాయిలెట్లు సరిగ్గా పని చేయడం లేదు. దీంతో 5,000 మంది సైనికులు ఇబ్బందిపడుతున్నారు. అమెరికా నేవీకి చెందిన యుూఎస్ఎస్ గెరాల్డ్ ఆర్.ఫోర్డ్ అనే భారీ యుద్ధనౌక దాదాపు 9 నెలలుగా అంటే.. గత జూన్ నుంచి సముద్రంలోనే ఉండిపోయింది. మిడిల్ ఈస్ట్‌లో నెలకొన్న సంక్షోభం దృష్ట్యా ఈ నౌక ఇంతకాలం తీరానికి చేరుకోలేదు.

ఇందులో దాదాపు సిబ్బంది, సైనికులు కలిపి 5,000 మంది పని చేస్తున్నారు. అయితే, వీరికి ఇప్పుడు ఒక విచిత్రమైన సమస్య ఎదురైంది. నౌకలోని 650 టాయిలెట్లు సరిగ్గా పని చేయడం లేదు. చాలా కాలంగా నౌక సముద్రంలోనే ఉండిపోవడం వల్ల సరైన నిర్వహణ సాధ్యం కాలేదు. దీనికి సంబంధించిన ఎక్విప్‌మెంట్ చాలా వరకు పాడైంది. ఫలితంగా ప్లంబింగ్ సిస్టమ్ దెబ్బతింది. దీంతో టాయిలెట్లు బ్లాక్ అయి పనిచేయడం లేదు. ఇక్కడి టాయిలెట్లు వాక్యూమ్ సిస్టమ్ ద్వారా పని చేస్తాయి. గత జనవరి నుంచి ఇవి సరిగ్గా పని చేయడం లేదు. దీంతో పురుషులు, స్త్రీలు చాలా ఇబ్బంది పడుతున్నారు. తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్న ఇలాంటి సమయంలో ఈ టాయిలెట్లు మరింత ఇబ్బంది పెడుతున్నాయి.

ఈ సమస్యను పరిష్కరించేందుకు సిబ్బంది ప్రయత్నిస్తున్నా సరైన ఫలితం ఉండటం లేదు. తమకు కలుగుతున్న అసౌకర్యం విషయంలో ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అందులోనూ ఎనిమిది నెలలుగా సైన్యం, సిబ్బంది నౌక నుంచి బయటకు వెళ్లలేదు. ఈ నేపథ్యంలో ఇక్కడి మోహరింపు పూర్తవగానే కొందరు సైన్యాన్ని వీడేందుకు కూడా సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

# మహిళలు ఆర్థికంగా బలపడాలి : మునుకుంట్ల సర్పంచ్ నరేశ్

నల్గొండ, ఫిబ్రవరి 24: మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబ స్థితి మెరుగు పడుతుందని కట్టంగూర్ మండలంలోని మునుకుంట్ల సర్పంచ్ గుల్లి నరేశ్ అన్నారు. మంగళవారం గ్రామంలో మదర్ థెరిసా రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ, మహిళా సంఘాల ఆధ్వర్యంలో ముందస్తు అంతర్జాయ మహిళ దినోతవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ.. మహిళా సంఘాల సభ్యులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ముందుకు సాగాలని సూచించారు. మహిళా సంఘాల అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

యువత డ్రగ్స్, తాగుడుకు బానిస కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మహిళలకు సూచించారు. మహిళా సంఘాల అభివృద్ధి కోసం పని చేస్తున్న మదర్ థెరిసా రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీని అభినందించారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేశారు. అనంతరం సర్పంచ్ నరేశ్‌ను మహిళా సంఘాల సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కడారి మల్లేష్, ఫాదర్ పొలిశెట్టి జూలియన్, యాపాల కుశలవ, నవ్య, గంటకంపు రామలింగమ్మ, జానకి, నవ్య, సుజాత, పద్మ, సంధ్యారాణి, నాగమణి, శ్రీలత, రుక్కమ్మ పాల్గొన్నారు.

# ఉచిత పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



నల్గొండ, ఫిబ్రవరి 24: గ్రామాల్లో ఏర్పాటు చేసే ఉచిత పశువైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని నల్లగొండ జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఈఓ రాజశేఖర్ అన్నారు. మంగళవారం కట్టంగూర్ మండలంలోని భాస్కరబాయి గ్రామంలో పశు సంవర్ధక శాఖ, పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత పశు వైద్య శిబిరాన్ని స్థానిక సర్పంచ్ ఎన్న మౌనికా వెంకట్ రెడ్డితో కలిసి ప్రారంభించి మాట్లాడారు. రైతులు అధిక పాల దిగుబడినిచ్చే మేలు జాతి దూడలను పొంది ఆర్థికంగా ఎదగాలన్నారు. కృత్రిమ గర్భధారణతో పుట్టిన దూడలు కేవలం మూడు సంవత్సరాలు పెంచితే లక్ష విలువైన గేదెలుగా మారుతాయన్నారు. పశువులకు వచ్చే వ్యాధులను గుర్తించి వెంటనే పశు వైద్యాధికారులను సంప్రదించాలని సూచించారు. అనంతరం రైతులకు క్యాల్షియం, మినరల్ మిక్సర్ ప్యాకెట్లు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారిణి రవి, మాజీ సర్పంచ్ ఎన్న నర్సిరెడ్డి, సూపర్ వైజర్ బండ సాయి, గోపాలమిత్రలు చెరుకు శ్రీనివాస్, కావటి యాదగిరి, వార్డు సభ్యులు శేఖర్, పశు వైద్య సిబ్బంది పజ్జారి రేణుక. రైతులు బుచ్చిరెడ్డి. మాధవరెడ్డి పాల్గొన్నారు.

# గిఫ్ట్ (జీఐఎఫ్‌టీ) సిటీ నుంచి షాపూర్ వరకు గుజరాత్ మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (జీఎమ్ఆర్‌సీ) ఉత్తర-దక్షిణ కారిడార్ విస్తరణకు కేబినెట్ ఆమోదం

న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 24: గిఫ్ట్ సిటీ నుంచి షాపూర్ వరకు 3.33 కిలోమీటర్ల పొడవున మెట్రో కారిడార్ విస్తరణకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ ఈ రోజు ఆమోదం తెలిపింది. ఇందులో మూడు ఎలివేటెడ్ స్టేషన్లు ఉంటాయి. ఈ ప్రాజెక్టును దాదాపు నాలుగు సంవత్సరాల్లో పూర్తి చేయడం లక్ష్యంగా నిర్దేశించారు.

ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.1,067.35 కోట్లు. ఈ విస్తరించిన కారిడార్ 2029 నాటికి సుమారు 23,702 మంది ప్రయాణికులకు, 2041 నాటికి సుమారు 58,059 మంది ప్రయాణికులకు ప్రయోజనం చేకూరుస్తుందని అంచనా వేస్తున్నారు.

అహ్మదాబాద్, గిఫ్ట్ సిటీ ప్రాంతాల మధ్య కనెక్టివిటీని ఈ కారిడార్ బలోపేతం చేస్తుంది. ప్రతిపాదిత మార్గంలో ఉన్న ప్రధాన బహుళజాతి కంపెనీలు, విద్యా సంస్థలు, వాణిజ్య కేంద్రాలకు ప్రత్యక్ష ప్రయోజనం కలుగుతుంది.

ఈ విస్తరణ అహ్మదాబాద్-గిఫ్ట్ సిటీ ప్రాంతాల మధ్య ప్రయాణించే రోజువారీ ప్రయాణికులకు వ్యాపారం, ఉపాధి, విద్యా సంబంధిత ప్రయాణ అవసరాలను తీర్చడానికి ప్రయోజనకరంగా ఉంటుంది. తద్వారా నెట్‌వర్క్ ఏకీకరణ, ప్రయాణికుల సౌలభ్యం గణనీయంగా మెరుగవుతుంది.

ఈ ప్రాజెక్టు నిర్మాణం సుమారు 1,000 ఉద్యోగాలను సృష్టిస్తుందని భావిస్తున్నారు. నిర్మాణానంతర దశలో కార్యాచరణ, నిర్వహణ ద్వారా సుమారు 250 మంది ఉపాధి పొందుతారు. ఈ ప్రాజెక్టు పైన పేర్కొన్న సంఖ్యకు సమానమైన ప్రత్యక్ష ఉపాధి అవకాశాలనూ గణనీయ సంఖ్యలో సృష్టిస్తుంది. ఇతర కార్యకలాపాల ద్వారా మరింత మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుంది.

భారత ప్రభుత్వం, గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వాల 50:50 జాయింట్ వెంచర్ అయిన గుజరాత్ మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఈ ప్రాజెక్టును అమలు చేస్తుంది.

ప్రస్తుతం, గుజరాత్ మెట్రో 68.28 కిలోమీటర్ల విస్తీర్ణంలో అహ్మదాబాద్ మెట్రో ఫేజ్-ఎ టఏపీఎంసీ నుంచి మొతెరా స్టేడియం (నార్త్-సౌత్ కారిడార్)... థాల్తేజ్ గామ్ నుంచి వస్త్రల్ గామ్ (ఈస్ట్-వెస్ట్ కారిడార్)ఉ... ఫేజ్-ఎఎ (మొతెరా స్టేడియం నుంచి మహాత్మా మందిర్, జీఎన్ఎల్‌యూ నుంచి గిఫ్ట్ సిటీ వరకు) మొత్తం 53 స్టేషన్లతో సెప్టెంబర్-2022 (ఫేజ్-ఎ), జనవరి-2026 (ఫేజ్-ఎఎ) నుంచి విజయవంతంగా కార్యకలాపాలను ప్రారంభించాయి. ఈ లైన్‌లో ప్రయాణిస్తున్న రోజువారీ ప్రయాణికుల సంఖ్య దాదాపు 1,60,000గా ఉంది.

# కనుముకులలో వైభవంగా వేంకటేశ్వరుడి తిరు కల్యాణం

## -హాజరైన మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, పార్లమెంట్ ఇన్‌చార్జి క్యామ మల్లేష్



నల్గొండ, ఫిబ్రవరి 24: భూదాన్ పోచంపల్లి మండలంలోని కనుముకుల గ్రామంలో శ్రీ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం తిరు కల్యాణ మహోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. స్వామివారి కల్యాణోత్సవంను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవానికి రాష్ట్ర మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్వర్ రెడ్డి, భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి, భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి క్యామ మల్లేష్ యాదవ్, ప్రముఖ సినీ నటుడు శివాజీ తదితరులు హాజరయ్యారు. ఆలయాన్ని వారు సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు కోట మల్లారెడ్డి ప్రముఖులను శాలువా, మెమొంటోలతో ఘనంగా సత్కరించారు. కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు.

ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కోట మల్లారెడ్డి పుష్పలత, పిఎసిఎస్ మాజీ చైర్మన్ కందాల భూపాల్ రెడ్డి, గ్రామ సర్పంచ్ చుక్క శోభాశంకర్, ఉప సర్పంచ్ పడమటి మహిపాల్ రెడ్డి, ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు కోట పాండురంగారెడ్డి, ప్రతినిధులు భోగ చంద్రశేఖర్, కోట అభిలాష్ రెడ్డి, బంధారపు సుమలత లక్ష్మణ్ గౌడ్, దుర్గం నరేష్, చిల్లర జంగయ్య, నూకల లింగస్వామి, రంగ మధు, కోట భూపాల్ రెడ్డి, కోట సత్తిరెడ్డి, మట్టిపల్లి ఐలయ్య, చింత కింది కిరణ్, పర్వతం అశోక్, నోముల ఉపేందర్ రెడ్డి, కటుకూరి శ్రీనివాస్, వేణుగోపాలచారి, మదన్ మోహన్ రెడ్డి, రంగారెడ్డి, నవీన్, తిరుమలేష్, నవీన్, రాములు, పారిజాత, భార్గవి, ఐశ్వర్య, మంజుల, మాధవి, అర్చకుడు వంశీకృష్ణ మాచార్యులు పాల్గొన్నారు.

# పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ

నల్గొండ, ఫిబ్రవరి 24: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి పదో తరగతిలో ప్రతి ఒక్కరు ఉత్తీర్ణత సాధించాలని తుంగతుర్తి సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు అన్నారు. మంగళవారం కీర్తిశేషులు ధర్మారపు ఉప్పలయ్య 2వ వర్ధంతి సందర్భంగా తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 51 మంది విద్యార్థిని విద్యార్థులకు పరీక్ష ప్యాడులు, స్కేలులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు అల్వాల ప్రవీణ్ కుమార్, మందడి కవిత, పీడీ కొండగడుపుల యాకయ్య, ఉపాధ్యాయులు గుజ్జ భాస్కర్, సహదేవ్, రాజు, కొండ పరశురాం పాల్గొన్నారు.

# నిత్యం జీవితంలో సైన్స్ అన్వయంతో ఉన్నత శిఖరాలు : డీఈఓ నాగలక్ష్మి



నల్గొండ, ఫిబ్రవరి 24: నిత్య జీవితంలో సైన్స్‌ను అన్వయించుకుంటూ జీవన విధానంలో భాగంగా మార్చుకుంటే విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యాశాఖ అధికారి నాగలక్ష్మి అన్నారు. మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫిజికల్ సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో ఆనంద ఖని పాఠశాల నందు జిల్లా స్థాయిలో టాలెంట్ టెస్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ పోటీల్లో సుమారు 120 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీలలో 9వ తరగతి చదువుతున్న కె.వరుణ్ సాయి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జగన్నాథపురం విద్యార్థి, ప్రథమ బహుమతిని సాధించాడు. ఈ విద్యార్థికి ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయిని బి.దుర్గా శైలజ గైడ్ టీచర్‌గా మార్గనిర్దేశనం చేశారు. ద్వితీయ బహుమతి బి. ధనుష్, ఉన్నత పాఠశాల ఆనందఖని విద్యార్థి, తృతీయ బహుమతి షేక్ నజీమా, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భద్రాచలం విద్యార్థిని సాధించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ ఆఫీసర్ సంపత్ కుమార్, జిల్లా విద్యాశాఖ సమన్వయకర్తలు నాగరాజ్ శేఖర్, సైదులు, సతీష్, ఫిజికల్ సైన్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు అమీరుద్దీన్, యశోద, అనురాధ, మోహన్ పాల్గొన్నారు.

# హిందూ ధర్మ రక్షణకు సంఘటితంగా కృషి చేద్దాం..

ఆదిలాబాద్, ఫిబ్రవరి 24: హిందూ ధర్మ రక్షణకు సంఘటితంగా కృషిచేద్దామని నారాయణపేట విహెచ్ పి జిల్లా ఉపాధ్యక్షులు యంగలిరాములు పిలుపునిచ్చారు. మంగళవారం నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల పరిధిలోనిచిన్నపోర్ల గ్రామంలో విహెచ్ పి, భజరంగ్ దళ్ నూతన నూతన కమిటీలనుఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో దైవభక్తి దేశభక్తి పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ నడుంబిగించాలని అన్నారు. హిందూ సంస్కృతి సాంప్రదాయాలు భావితరాలకు అందజేసేందుకు కృషి చేద్దామన్నారు. విహెచ్ పి గ్రామ అధ్యక్షులు కోట్ల శ్రీకాంత్ ఉపాధ్యాక్షులు కోట్ల నరేష్ కార్యదర్శిగా పెద్దమోల అనిల్,సహకార్యదర్శిగా వాకిటి నవీన్,కోశాధికారిగా పూలాన్ శ్రీనివాన్,భజరంగ్ దళ్ సంయోజక్ మారేపొల్లా నరేందర్, సహసంయోజక్ గార్లపల్లి గోరక్షా ప్రముఖ్ ఆకుల రామ్ నరేష్ సత్సంగ్ ప్రముఖ్ చిన్నసంజీవ్ సహా సత్సంగ్ ప్రముఖ్ సాయి రామ్ శ్రీనివాస్, భజరంగ్ దళ్ కార్యవర్గం భజరంగ్ దళ్ సంయోజక్ కోట్ల శ్రీనివాస్,సహసంయోజక్, గాండ్ల చంద్రమోహన్,బలోపాసన ప్రముఖ్ అనిల్,విద్యార్థి ప్రముఖ్ గంజి సురేష్ కుమార్,సేవప్రముక్ దుబ్బనోల నర్సిములు,గోరక్షా ప్రముఖ్ కర్ని విష్ణు,సప్త హిక్ మిలన్ ప్రముఖ్ శ్రీ నిఖిల్ కార్యవర్గ సభ్యులు బాలకృష్ణ,డి అశోక్ అనిల్,శివానంద్,చేన్న కేశవ్ శ్రీనివాస్ లను ఎన్నుకొని సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామఉప సర్పంచ్ సంజీవ్,ఊట్కూర్ మండల వి హెచ్ పి అధ్యక్షులు దొబ్బలి భీమ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# బఫర్ జోన్ పేరుతో ఇండ్ల తొలగింపును ఆపాలి

## -సీపీఐ( ఎమ్ ఎల్) సీపీ రెడ్డి పార్టీ జాతీయ కార్యదర్శి మల్లేపల్లి ప్రభాకర్ డిమాండ్

హైదరాబాద్ ఫిబ్రవరి 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: మూసి సుందరీకరణలో భాగంగా బఫర్ జోన్ పేరుతో పేదల ఇండ్లను కూల్చాడ నీ తక్షణమే నిలిపివేయాలని సీపీఐ ( ఎమ్ ఎల్) సీపీ రెడ్డి పార్టీ జాతీయ కార్యదర్శి మల్లేపల్లి ప్రభాకర్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం న్నీ డిమాండ్ చేశారు ఈ మేరకు ఒక ప్రకటనలో పేర్కొన్నారు ‘ మూసి నది మురికి కూపంగా మారిన నేపద్యంలో ప్రక్షాళన, నిజమైన నిజమైన పునర్జీవం జరగాలని హైద రాబాద్ ప్రజలు కోరుకుంటున్నారు,కానీ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను చూస్తుంటే ప్రక్షాళన కంటే సుందరీ కరణ, రియల్ ఎస్టేట్,టూరిజం వ్యాపారి కరనే కె ప్రాధాన్యత ఇస్తున్నట్లు స్పష్టం అవుతున్నది అని మూసి నదికి ఇరు వైపుల 50 మీటర్ల వరకు “ బఫర్ జోన్” పేరుతో దశద్బులుగా నివ సిస్తున్న ప్రజల ఇండ్లను తొలగిం చేందుకు ప్రభుత్వం సిద్ధపడటం అన్యాయమైనది , ప్రభుత్వ అనుమతులతో నిర్మించుకున్న ఇండ్లను ఇపుడు అక్రమంగా ఎలా ప్రకటిస్తారు.. బఫర్ జోన్ లో ఉంటే గతంలో అనుమతులు ఎలా ఇచ్చారు.. ఈ ప్రశ్నలకు సమా ధానం చెప్పకుండా ఏక పక్షంగా కూల్చివేతలు చేపట్టడం ప్రజా స్వామ్య విరుద్ధం అని పేర్కొ న్నారు, మూసి నది వరదలతో ఏనాడు మునిగి పోనీ బస్తీలు, కాలనీలను ఈ ప్పుడు తొలగించాల్సిన అవసరం ఏమొచ్చింది.. గరిష్ట నది ప్రవాహ మట్టం వివరాలను ఎందుకు ప్రజలకు వెల్ల డించడం లేదు అని నిలదీశారు” గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ ‘ రీ వర్ ఫ్రోంట్ డెవలప్మెంట్” పేర్లతో పేద ప్రజల ను నిరస్రేయుల్ని చేసి, ఆ భూములను ,టూరి జం,ప్రవేట్ ప్రాజెక్టు లకు కట్ట బట్టే ప్రయత్నని విరమించుకోవాలని డిమాండ్ చేశారు,


అమరావతి సాహితీ మిత్రులు, గుంటూరు

డాక్టర్ జెల్ది విద్యాధర్ కవిత్వం
సాహితీ సమాలోచన సభ
నాలుగు కవితా సంపుటాలపై నలుగురు వక్తల విశ్లేషణ

తేది: 01-03-2026 ఆదివారం ఉ॥ గం॥ 10.00 లకు
వేదిక : బ్రాడీపేట 2/1 , ఎస్ హెచ్ ఓ , గుంటూరు, ఆంధ్రప్రదేశ్

సభాధ్యక్షులు - డాక్టర్ రావి రంగారావు గారు
ప్రఖ్యాత సాహితీవేత్త, వ్యవస్థాపక అధ్యక్షులు, అమరావతి సాహితీ మిత్రులు

ముఖ్య అతిథి - డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు గారు
ప్రఖ్యాత సాహితీవేత్త, సంగీత విద్వాంసులు

విశిష్ట అతిథి - శ్రీ పెనుగొండ లక్ష్మీనారాయణ గారు
కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, సుప్రసిద్ధ విమర్శకులు

స్వాగత వచనం - శ్రీమతి పింగళి భాగ్యలక్ష్మి గారు
ప్రముఖ కవయిత్రి, కార్యక్రమ నిర్వాహకురాలు

1. అంతరంగపు భాష - శ్రీమతి శైలజా మిత్ర గారు
సుప్రసిద్ధ కవయత్రి రచయిత్రి సమీక్షకులు

2. తోటమాలి మాలిమి - శ్రీమతి తాటికోల పద్మావతి గారు
ప్రముఖ కథా రచయిత్రి కవయిత్రి

3. కోహినూర్ - శ్రీ యర్రగుంట్ల పాణిరావు గారు
ప్రముఖ కవి, విమర్శకులు

4. ముసాఫిర్ - శ్రీ సరికొండ నరసింహారాజు గారు
ప్రముఖ కవి, రచయిత, విమర్శకులు

కవి స్పందన - డాక్టర్ జెల్ది విద్యాధర్

వందన సమర్పణ - శ్రీ పలకలూరి శివరావు గారు
ప్రముఖ కవి, సామాజిక సేవా తత్పరులు

ఆహ్వానించువారు : అమరావతి సాహితీ మిత్రులు, గుంటూరు


# 2026-27 సీజన్‌కు ముడి జనపనారకు కనీస మద్దతు ధరలకు కేబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ.. 2026-27 మార్కెటింగ్ సీజనుకు సంబంధించి ముడి జనపనార కనీస మద్దతు ధరలకు ఈ రోజు ఆమోదం తెలిపింది.

2026-27 సీజనుకు గాను ముడి జనపనార (టీడీ-3 గ్రేడ్) కనీస మద్దతు ధరను క్వింటాలుకు రూ. 5,925/- గా నిర్ణయించింది. ఇది అఖిల భారత సగటు ఉత్పత్తి వ్యయంపై 61.8 శాతం లాభాన్ని అందిస్తుంది.

భారత ప్రభుత్వం 2018-19 బడ్జెటులో ప్రకటించిన మేరకు- అఖిల భారత సగటు ఉత్పత్తి వ్యయానికి కనీసం 1.5 రెట్లు కనీస మద్దతు ధర ఉండాలన్న సూత్రానికి అనుగుణంగా.. 2026-27 మార్కెటింగ్ సీజనుకు సంబంధించి ముడి జనపనారకు ఎంఎస్పీని నిర్ణయించారు.గత 2025-26 సీజనుతో పోలిస్తే.. 2026-27 మార్కెటింగ్ సీజనుకు ప్రకటించిన ముడి జనపనార కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ. 275/- పెరిగింది. ముడి జనపనార కనీస మద్దతు ధర 2014-15లో క్వింటాలుకు రూ. 2,400/- ఉండగా, 2026-27 నాటికి ప్రభుత్వం దానిని రూ. 5,925/- కు పెంచింది.

అంటే క్వింటాలుకు రూ. 3,525/- (2.5 రెట్లు) పెరుగుదల నమోదైంది. 2014-15 నుంచి 2025-26 వరకు జనపనార రైతులకు చెల్లించిన కనీస మద్దతు ధర రూ. 1342 కోట్లు. కాగా 2004-05 నుంచి 2013-14 వరకు చెల్లించిన మొత్తం రూ. 441 కోట్లు మాత్రమే.ధరల మద్దతు కార్యకలాపాలను చేపట్టడంలో కేంద్ర ప్రభుత్వ నోడల్ సంస్థగా భారత జనపనార కార్పొరేషన్ (జేసీఐ) కొనసాగుతుంది.

ఆ కార్యకలాపాల్లో ఏదైనా నష్టం వాటిల్లితే.. ఆ మొత్తాన్నీ కేంద్ర ప్రభుత్వం పూర్తిగా తిరిగి చెల్లిస్తుంది.

# సనత్‌నగర్ ఈఎస్ఐ ఆసుపత్రిలో ఈఎస్ఐ వ్యవస్థాపక దినోత్సవం



హైదరాబాద్, ఫిబ్రవరి 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్); : సనత్‌నగర్ ఈఎస్ఐ ఆసుపత్రిలో నిర్వహించిన ఈఎస్ఐ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర కార్మిక మరియు గనుల శాఖ మంత్రి డా. జీ. వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్, ఈఎస్ఐసీ రీజినల్ డైరెక్టర్ రాజీవ్ లాల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ దూరదృష్టితోనే కనీస వేతనాలు, కార్మికుల హక్కులు, వారి భద్రత కోసం ఈఎస్ఐ కార్పొరేషన్ స్థాపించబడిందని పేర్కొన్నారు. కార్మికుల సంక్షేమం కోసం తీసుకున్న ఆ నిర్ణయం దేశంలోని లక్షలాది కార్మిక కుటుంబాలకు ఆరోగ్య భరోసాను కల్పించిందన్నారు. తన కుటుంబానికి కార్మిక సంక్షేమంతో ప్రత్యేక అనుబంధం ఉందని, తన తండ్రి కేంద్ర మరియు రాష్ట్ర కార్మిక మంత్రిగా సేవలందించారని మంత్రి గుర్తు చేశారు. గతంతో పోలిస్తే ఈఎస్ఐ ఆసుపత్రుల్లో సదుపాయాలు విస్తృతంగా మెరుగుపడ్డాయని తెలిపారు .రోగికి వైద్యంతో పాటు ధైర్యం ఇవ్వడం కూడా వైద్యుల బాధ్యత అని మంత్రి సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులపై విమర్శలు వినిపించినా, ఈఎస్ఐ ఆసుపత్రుల సేవలపై పెద్దగా ఫిర్యాదులు రావని ఆయన అన్నారు .దేశంలోని పేదలకు అత్యవసరంగా అవసరమయ్యేవి విద్య, వైద్యం మాత్రమేనని మంత్రి స్పష్టం చేశారు. కార్పొరేట్ ఆసుపత్రులు లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్న ఈ కాలంలో, ఈఎస్ఐ వంటి సంస్థలు కార్మికులకు నాణ్యమైన వైద్యసేవలను అందించడం అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కార్మికులకు వైద్య సేవల విషయమా లో చిత్తశుద్ధి తో పనిచేస్తోందని, ఈఎస్ఐ సేవలను మరింత విస్తరించేందుకు ముఖ్యమంత్రి శంషాబాద్‌లో కొత్త ఆసుపత్రి నిర్మాణానికి భూమి కేటాయించేందుకు సానుకూలంగా స్పందించారని వెల్లడించారు. చెన్నూరులో 50 పడకలతో ప్రారంభమైన చిన్న ఆసుపత్రి ప్రస్తుతం పూర్తిస్థాయిలో సేవలందిస్తోందని మంత్రి తెలిపారు. అలాగే 18 ఇూఎఐ డిస్పెన్సరీలు రద్దవుతన్నాయన్న సమాచారం అందిన వెంటనే కేబినెట్‌లో చర్చించి, వాటి నిర్మాణానికి నిర్ణయం తీసు కున్నామని వెల్లడించారు. ఈఎస్ఐ ఆసుపత్రిలో అవయవ మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించడం గొప్ప విషయమని, అవయవ దాతలకు మంత్రి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈఎన్ఐ ద్వారా కార్మికులకు మరింత విస్తృతంగా, సమర్థవంతంగా సేవలు అందేలా ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని మంత్రి హామీ ఇచ్చారు.

# అమెరికాలో తీవ్ర రూపం దాల్చిన మంచు తుఫాను

## –జనం ఇళ్లకే పరిమితమయిన లక్షలాదిగాజనం



న్యూ డిల్లీ ఫిబ్రవరి 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: అమెరికా లో మంచు తుఫాను తీవ్ర రూపం దాల్చింది. ఈశాన్య ప్రాంతాల్లో భారీగా మంచు కురుస్తోంది. దాంతో లక్షలాదిగా జనం ఇళ్లకే పరిమితమయ్యారు. మంచు తుఫాను, బలమైన ఈదురు గాలుల కారణంగా రవాణా కష్టంగా మారింది. వేలాది విమన సర్వీసులు రద్దయ్యాయి. తుఫాను తీవ్రత దృష్ట్యా విమాన సర్వీసులను రద్దు చేస్తున్నట్లు విమానయాన సంస్థలు ముందుగానే ప్రకటించాయి. శనివారం నుంచి మంగళవారం మధ్య 10 వేల కంటే ఎక్కువ విమాన సర్వీసులు రద్దయినట్లు విమానాల ట్రాకింగ్ సర్వీస్ 'ఫ్లైట్ అవేర్' పేర్కొన్నది. ఇందులో సోమవారమే 5 వేల కంటే ఎక్కువ రద్దయ్యాయని తెలిపింది. న్యూయార్క్‌లోని జేఎఫ్‌కే, లగ్వార్డియా విమనాశ్రయాలు, బోస్టన్ లోగన్, నెవార్క్ లిబర్టీ నుంచి రాకపోకలు సాగించాల్సినవే ఎక్కువగా ఉన్నట్లు వెల్లడించింది. పలు రాష్ట్రాల్లో రైలు, బస్ సేవలు కూడా నిలిచిపోయాయి. న్యూయార్క్ నగరంలోని సెంట్రల్ పార్కులో 15 అంగుళాల కంటే ఎక్కువ మంచు కురిసింది. మరికొన్ని ప్రాంతాల్లో రెండు అడుగులకుపైనే మంచు పేరుకుపోయింది. ఈ భారీ హిమపాతం కారణంగా పలుచోట్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దాంతో లక్షలాది ఇళ్లు, వ్యాపార సముదాయాలు అంధకారంలో చిక్కుకుపోయాయి. విద్యుత్ సేవలను పునరుద్ధరించేందుకు సిబ్బంది ప్రయత్నిస్తున్నారని అధికారులు తెలిపారు.

# జయలలిత నెచ్చెలి శశికళ.. త్వరలో కొత్తపార్టీ ..?

చెన్నయ్ం ఫిబ్రవరి 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );మాజీ ముఖ్యమంత్రి జయలలిత స్నేహితురాలు శశికళ కొత్తపార్టీ పెట్టనున్నట్లు సంకేతాలు ఇచ్చారు. జయలలిత జయంతిని పురస్కరించుకుని ఆమె స్మారకం దగ్గర శశికళ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె.. 'తమిళ ప్రజలకు త్వరలో శుభవార్త చెప్పబోతున్నా' అంటూ కీలక వ్యాఖ్యలు చేశారు .అమ్మ జయంతి సందర్భంగా ఓ కార్యక్రమం నిర్వహిస్తున్నామని శశికళ అన్నారు. అందు లో శుభవార్త చెప్పబోతున్నానని తెలిపారు. అన్నాడీఎంకే నుంచి బహిష్కరణకు గురైన శశికళ.. కొత్త పార్టీని ఏర్పాటు చేస్తారనే ఊహాగానాలు ఊపందుకున్నాయి. ఈ ఏడాది తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు జరగనుండటంతో శశికళ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# శ్రీనగర్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ప్రయాణికుల విభాగ విస్తరణకు కేబినెట్ ఆమోదం

## –జమ్మూ, కాశ్మీర్ విమానయాన రంగంలో ఒక కొత్త శకానికి నాంది

న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 24: శ్రీనగర్ అంతర్జాతీయ విమానాశ్రయంలో దాదాపు రూ.1,677 కోట్ల అంచనా వ్యయంతో ప్రయాణికుల విభాగాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఇవాళ ఆమోదం తెలిపింది. కాశ్మీర్ లోయలో విమానయాన రంగ మౌలిక సదుపాయాలను, అనుసంధానతను బలోపేతం చేసేందుకు ఈ ప్రాజెక్టు కీలకం. ఈ ప్రాజెక్టులో భాగంగా భద్రతా సిబ్బంది కోసం బ్యారెక్‌లను నిర్మించనున్నారు. భారత వైమానిక దళం (ఐఏఎఫ్)కి చెందిన బుద్గాం ఎయిర్ బేస్ ప్రాంగణంలోని ఈ విమానాశ్రయం ఇండియా ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ (ఏఏఐ) పరిధిలో ఉంది. శ్రీనగర్ నుంచి సుమారు 12 కి.మీ దూరంలోని ఈ విమానాశ్రయాన్ని 2005లో అంతర్జాతీయ విమానాశ్రయంగా గుర్తించారు.

73.18 ఎకరాల్లో విస్తరించనున్న ఈ నూతన ప్రయాణికుల విభాగంలో అత్యాధునిక సౌకర్యాలతో టెర్మినల్ భవనాన్ని నిర్మిస్తారు. 71,500 చదరపు మీటర్ల (ప్రస్తుతమున్న 20,659 చదరపు మీటర్లు సహా) విస్తీర్ణంలో ఈ టెర్మినల్ ఉంటుంది. రద్దీ సమయాల్లో 2,900 మంది ప్రయాణికులు, ఏడాదికి 10 మిలియన్ల మంది ప్రయాణికులు (ఎంపీపీఏ) రాకపోకలు సాగించేలా ఈ టెర్మినల్‌ను డిజైన్ చేశారు. విస్తరించిన ఏప్రాన్ లో మొత్తం 15 విమాన పార్కింగ్ స్థలాలు ఉండగా..1 వైడ్ బాడీ (కోడ్ ఈ) విమానానికి స్థలం కేటాయించారు (మొత్తం15లో ప్రసుత్తమున్నవి 9 కాగా, 6 కొత్తగా ప్రతిపాదించినవి). 3,658 మీటర్ల పొడవు, 45 మీటర్ల వెడల్పు గల రన్ వే ఐఏఎఫ్ నిర్వహణలోనే ఉంటుంది. ఈ ప్రాజెక్టులో భాగంగా 1,000 కార్లను పార్కింగ్ చేసేలా, మల్టీ లెవల్ కార్ పార్కింగ్ సౌకర్యాన్ని కల్పించనున్నారు.

ఆధునిక డిజైన్, కాశ్మీర్ సాంస్కృతిక వారసత్వ కలయితో ఈ కొత్త టెర్మినల్ నిర్మాణం ఉంటుంది. ఇందులో చెక్కతో చేసే ప్రత్యేకమైన కళ, స్థానిక కళాకృతుల వంటి సంప్రదాయ అంశాలతో ప్రయాణికులకు సత్వర సేవలు అందించే, విశాలమైన విశ్రాంతి ప్రదేశాలు, అత్యాధునిక భద్రత, చెక్-ఇన్ సదుపాయాలను కల్పించటం ద్వారా కార్యకలాపాల సామర్థ్యాన్ని పెంపొందిస్తారు.

స్థిరత్వమే అభివృద్ధికి ప్రధానాంశంగా చేపట్టనున్న ఈ నిర్మాణంలో వర్షపు నీటి నిల్వకు అత్యాధునిక వ్యవస్థలు, విద్యుత్ వినియోగాన్ని తగ్గించేందుకు సహజంగా వెలుతురు వచ్చే ఏర్పాట్లు, కర్బన ఉద్గారాలను తగ్గించేందుకు స్థానికంగా లభించే పర్యావరణ అనుకూల సామాగ్రిని ఉపయోగించారు. ప్రతిష్ఠాత్మకమైన 5 స్టార్ గృహ రేటింగ్ సాధించటమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును రూపొందించారు.

ఈ ప్రాజెక్టు కేవలం మౌలిక సదుపాయాల అభివృద్ధికే కాక, దాల్ సరస్సు, శంకరాచార్య ఆలయం, మొఘల్ గార్డెన్స్ వంటి ప్రసిద్ధ పర్యాటక ప్రాంతాలకు రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచటం ద్వారా పర్యాటకం, ఆర్థిక వృద్ధి గణనీయంగా పెరుగుతాయి. దీంతో ఉపాధి అవకాశాలు ఏర్పడి, పెట్టుబడులు పెరుగుతాయి. తద్వారా ప్రధాన పర్యాటక ప్రాంతంగా, ఆర్థిక కేంద్రంగా శ్రీనగర్ స్థానం బలపడుతుంది. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను అందించటంలో ప్రయాణికుల విభాగం అభివృద్ధి పరివర్తనాత్మక మార్పును సూచిస్తుంది. ఇది ప్రయాణికులకు మెరుగైన వసతులను, రవాణా సౌకర్యాలను కల్పించటమే కాకుండా కాశ్మీర్ సాంస్కృతిక, ప్రకృతి సౌందర్యాన్ని ప్రపంచానికి చాటిచెబుతుంది.

# ఈక్విటీ పెట్టుబడి పరిమితిని ప్రతి అనుబంధ సంస్థకు రూ.5000 కోట్ల నుంచి రూ.7500 కోట్లకు పెంచడానికి వీలుగా అదనపు అధికారాలు

న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 24: మహారత్న సీపీఎస్ఈలకు వర్తించే అధికారాల అప్పగింతపై ప్రభుత్వ సంస్థల విభాగం (డీపీఈ) ఫిబ్రవరి 4, 2010 నాటి మార్గదర్శకాల ప్రకారం పవర్‌గ్రిడ్‌కి మెరుగైన అధికారాలు కల్పించే నిర్ణయానికి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఈ రోజు ఆమోదం తెలిపింది. ఈ ఆమోదం కంపెనీ నికర విలువలో 15 శాతంగా ఉన్న ప్రస్తుత పరిమితిని నిలుపుకుంటూనే పవర్ గ్రిడ్ కోసం అనుమతించదగిన ఈక్విటీ పెట్టుబడి పరిమితిని ప్రతి అనుబంధ సంస్థకు రూ.5,000 కోట్ల నుంచి రూ.7,500 కోట్లకు పెంచడానికి వీలు కల్పించింది.

ఈ ఆమోదం దేశంలో అతిపెద్ద, అత్యంత అనుభవం గల ట్రాన్స్‌మిషన్ సర్వీస్ ప్రొవైడర్ అయిన పవర్‌గ్రిడ్ తన ప్రధాన వ్యాపారంలో పెట్టుబడిని విస్తరించుకోవడానికి, పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని తరలించడంలో మద్దతునివ్వడానికి వీలు కల్పిస్తుంది. శిలాజేతర వనరుల ద్వారా 500 గిగావాట్ల లక్ష్యాన్ని సాధించడంలోనూ ఇది సహాయపడుతుంది.

పవర్‌గ్రిడ్ ఇప్పుడు అల్ట్రా హై వోల్టేజ్ ఆల్టర్నేటింగ్ కరెంట్ (యూహెచ్‌వీఏసీ), హై వోల్టేజ్ డైరెక్ట్ కరెంట్ (హెచ్‌వీడీసీ) ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్‌ల వంటి క్యాపిటల్-ఇంటెన్సివ్ ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టుల బిడ్లలో పాల్గొనడానికి వీలుంటుంది. కీలకమైన ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టుల బిడ్డర్ల ఎంపిక కోసం టారిఫ్ బేస్డ్ కాంపిటీటివ్ బిడ్డింగ్ (టీబీసీబీ)లో పోటీని ఇది విస్తృతం చేస్తుంది. ఇది మెరుగైన ధరల ఆవిష్కరణను నిర్ధారిస్తుంది. వినియోగదారులకు సరసమైన, స్వచ్ఛమైన ఇంధనం అందుబాటులో ఉండేలా చేస్తుంది.

# జర్నలిస్టులకు ఎలాంటి నిబంధనలు లేకుండా అక్రిడిటేషన్ కార్డులివ్వాలి : హరీష్ రావు



హైదరాబాద్, ఫిబ్రవరి 24: బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగులతోపాటు జర్నలిస్టులకు ఫ్రీ హెల్త్ స్కీమ్ తెచ్చిందని.. ఉద్యోగులకు 1% కంట్రిబ్యూషన్‌తో, జర్నలిస్టులకు పూర్తిగా ఉచితంగా సేవలు అందించాలని నిర్ణయించాం. కానీ ఇప్పుడు ఈ ప్రభుత్వం జర్నలిస్టులను చూస్తేనే విసుక్కుంటోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు అన్నారు. మంగళవారం వరంగల్‌లో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులను హరీష్ రావు ఇతర బీఆర్ఎస్ నేతలతో కలిసి పరిశీలించారు.

ఆసుపత్రి పనుల పురోగతిని పరిశీలించిన అనంతరం హరీష్ రావు కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ.. కేసీఆర్ 100 కోట్లతో జర్నలిస్టుల సంక్షేమ నిధి ఏర్పాటు చేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రెండు బడ్జెట్లలో జర్నలిస్టుల కోసం ఒక్క రూపాయి అయినా కేటాయించిందా.. అని ప్రశ్నించారు.

రెండున్నరేళ్లలో ఒక్కరికైనా కొత్త అక్రిడిటేషన్ కార్డ్ ఇచ్చారా.. జర్నలిస్టులకు ఎలాంటి నిబంధనలు లేకుండా అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలన్నారు హరీష్ రావు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసినట్లుగా జర్నలిస్టుల యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్‌కు ప్రభుత్వమే ప్రీమియం చెల్లించాలని.. లేదంటే ప్రమాదవశాత్తు జర్నలిస్టులు మరణిస్తే వాళ్ల కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్‌ను, జర్నలిస్టుల హెల్త్ స్కీమ్‌కు సమానంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

# ఫీజు రీఎంబర్స్మెంట్ మీద స్పందించకపోతే విద్యార్థి లోకం తిరగబడుతుంది

**–కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన ఈటల.**
**రేవంత్ రెడ్డిది బండరాయి లాంటి ప్రభుత్వం.**
**మానవత్వం లేని ప్రభుత్వం.**
**మనిషైతే ప్రాణం విలువ తెలుస్తుంది.**
**భూములు అమ్మి డబ్బులు డిల్లీకి పంపిస్తున్నాడు.**
**కేసీఆర్ లెక్కనే ఈ సీఎం చుట్టూ కూడా ల్యాండ్ మాఫియా తయారయ్యింది.**
**పేరుకే ప్రజాస్వామ్యం తప్ప పవర్ అంతా సెంట్రలైజ్ అయిపోయింది.**
**హైడ్రా భూమాఫియాకు కొమ్ము కాస్తుంది.**
**చట్టం చట్టబండలై బాసుల ఆదేశాల మేరకే పనులు జరుగుతున్నాయి.**
**దేనికైనా హద్దు పద్దు ఉంటుంది.**
**మల్కాజ్గిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ హెచ్చరిక**




హైదరాబాద్ ఫిబ్రవరి 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); ఫీజు రీఎంబర్స్మెంట్ రాలేదని విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా రేవంత్ రెడ్డి సర్కార్కు చీమకుట్టినట్టు కూడా లేదని మల్కాజ్గిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ విమ్మర్శించారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో జరిగిన అఖిలపక్ష విద్యార్థి సంఘాలు, మేధావులు, ఎస్సీ ఎస్టీ సంఘాల విస్తృతస్థాయి సమావేశానికి ఆయన హాజరై ప్రసంగించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన ఈటల.రేవంత్ రెడ్డిది బండరాయి లాంటి ప్రభుత్వం.మానవత్వం లేని ప్రభుత్వం.మనిషైతే ప్రాణం విలువ తెలుస్తుంది.భూములు అమ్మి డబ్బులు డిల్లీకి పంపిస్తు న్నాడు. కేసీఆర్ లెక్కనే ఈ సీఎం చుట్టూ కూడా ల్యాండ్ మాఫియా తయారయ్యింది. పేరుకే ప్రజాస్వామ్యం తప్ప పవర్ అంతా సెంట్రలైజ్ అయిపోయింది. హైడ్రా భూమాఫియాకు కొమ్ము కాస్తుంది.చట్టం చట్టబండలై బాసుల ఆదేశాల మేరకే పనులు జరుగుతున్నాయి. దేనికైనా హద్దు పద్దు ఉంటుందన్నారు.గతంలో మాలాంటి ఇందిరా పార్క్ దగ్గర ధర్నాలో మాట్లాడితే ఆ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని ధర్నా చేసేవారు కొంత సంతోష పడేవారు. అసెంబ్లీ సమావేశాలు జరిగేటప్పుడు ఈ సమస్య పరిష్కరించండి అని వినతి పత్రాలు ఇచ్చేవారు. కానీ ఇప్పుడు ధర్నాలలో అఖిలపక్ష నాయకులు మాట్లాడినా, సభలో ప్రతిపక్ష నాయకులు సమస్యలు లేవనెత్తినా ప్రభుత్వానికి చీమకుట్టినట్టుగా లేదు అనడానికి సజీవ సాక్ష్యం ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు. మీరు స్పందించకపోతే తెలంగాణ సమాజం తిరగబడుతుందని హెచ్చరిస్తున్నాను. ఫీజురెంబర్స్మెంట్ బకాయిలు అనేవి కొద్ది మంది కాలేజీ యాజమాన్యాల సమస్య కాదు లక్షల మంది తల్లిదండ్రుల వేదన. ఫీజు కట్టలేదని కాలేజీలో అవమానం ఎదుర్కొని ఆత్మహత్యలు చేసుకున్న వారి దీన గాథ ఇది. మనిషి అనేటువంటి వాడికి తెలుస్తుంది ప్రాణం విలువ, బాధ అంటే ఏమిటి అని. ఈ ప్రభుత్వం మానవత్వం కోల్పోయి బండ రాయి లెక్క మారింది. ఎన్నికల్లో హామీలు ఇస్తున్నప్పుడు నేను ఇన్ని డబ్బులు ఎక్కడి నుంచి తీసుకొస్తారు అని ప్రశ్నించాను.. ఆరోజు ఆయనకే తెలివి ఉందా మాకు లేదా అని దబాయించారు. హైదరాబాదులో తునక భూమి అమ్మితే వేలకోట్ల రూపాయలు వస్తాయి వచ్చిన హామీలను అమలు చేస్తానన్న వ్యక్తి రేవంత్ రెడ్డి. వచ్చి రెండు సంవత్సరాలు దాటింది.తునకలు అమ్ముకుంటున్నారు.. ప్రభుత్వంలో ఉన్నట్టుగానే ఈ ముఖ్యమంత్రి చుట్టూ కూడా ల్యాండ్ బ్రోకర్లు, ల్యాండ్ మాఫియా తయారయ్యారు.ఎల్లమ్మబండలో ఉన్న ప్రభుత్వ భూమి ప్రైవేట్ భూమి అని సుప్రీంకోర్టులో నెగ్గింది అంటేనే వారితో ఈ ప్రభుత్వం ఎంతగా కొల్యూడ్ అయిందో అర్థమవుతుంది. దాని విలువ 7వేల కోట్లు. ఫీజు రీయింబర్స్మెంట్ ఇచ్చేది 9 వేల కోట్లు.. ఎల్లమ్మ బండ భూమి అమ్మితే వచ్చేది 7వేల కోట్లు. నిజంగా ముఖ్యమంత్రి దమ్ముంటే ప్రజల పట్ల ప్రేమ ఉంటే నిజంగా సమస్యలు పరిష్కరించాలని ఉంటే ఎందుకు ఈ భూమిని బ్రోకర్లకు కట్టబెడుతున్నాడో సమాధానం చెప్పాలి. హైడ్రా వస్తే పేదల భూములు ఇల్లు పార్కులు కాపాడుతారు అనుకున్నాం ల్యాండ్ మాఫియా గుండెల్లో రైళ్లు పరిగెడతాయని అనుకున్నాం, కానే హైడ్రా ఈ ల్యాండ్ బ్రోకర్లకు అండగా నిలుస్తుంది. గాజులరామారంలో దగ్గర సర్వేనెంబర్ ఏడులో 300 ఎకరాల భూమిలో 40 గజాల్లో గుడిసెలు వేసుకుంటే వాటిని కూలగొట్టారు కానీ ల్యాండ్ మాఫియా చేతిలో ఉన్న భూమిని మాత్రం ముట్టలేదు.పేదల ఇల్లు కూలగొట్టి 15 వేల కోట్ల రూపాయల విలువగల భూమిని కాపాడామని ప్రకటన ఇచ్చుకోవడం నిస్సిగ్గుగా ఉంది. 5వేల కోట్ల పెట్టి గాంధీ విగ్రహాలు పెడతాను, లక్షన్నర కోట్లు పెట్టి మూసి ప్రక్షాళన చేస్తానని ముఖ్యమంత్రి చెప్తున్నారు..అభ్యంతరం లేదు కానీ మా పిల్లల ఆత్మహత్యలు ఆపి, మా పిల్లలకు దూరమవుతున్న విద్య అందించిన తర్వాత మీ ఇష్టం వచ్చినట్టు చేసుకోండి. చీఫ్ సెక్రటరీ స్థాయి అధికారి ఫైనాన్స్ సెక్రెటరీలు మా చేతిలో కూడా ఏమీ లేదుని చేతులెత్తేస్తున్నారు. పేరుకే ప్రజాస్వామ్యం తప్ప పవర్ అంతా సెంట్రలైజ్ అయిపోయింది. ముఖ్యమంత్రి కార్యాలయం ఆర్థిక మంత్రి చెప్పితే తప్ప బిల్లులు రాని పరిస్థితి ఉంది. ఈ రాష్ట్రం ఎటువైపు పోతుందో అర్థం చేసుకోవాలి. రిటైర్డ్ ఉద్యోగులకు వారు దాచుకున్న బెనిఫిట్స్ అందడం లేదు. కాంట్రాక్టు పని చేసిన వారు బిల్లులు రాక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

# రోజూ ఏడుస్తూ విసుగిస్తున్నాడని.. పసిబిడ్డను పొయ్యిలో వేసి చంపిన తల్లి

మధ్యప్రదేశ్, ఫిబ్రవరి 24: కన్నతల్లే తన కొడుకు పాలిట యమపాశంలా మారింది. రోజూ ఏడుస్తూ తనను విసిగిస్తున్నాడని ఓ తల్లి తన రెండు నెలల కొడుకుని కట్టెల పొయ్యిలో వేసి కాల్చి చంపింది. ఈ హృదయ విదారకమైన ఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్‌లో పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మధ్యప్రదేశ్‌కు చెందిన రాజేంద్ర, మమత దంపతులు గతకొంతకాలంగా బౌరంపేటలోని నిర్మాణంలో ఉన్న సనారెల్లి అపార్ట్‌మెంట్‌లో భవన నిర్మాణ కూలీలుగా పనిచేస్తున్నారు. అయితే తనను రోజూ విసిగిస్తున్నాడన్న కోపంలో మమత కొడుకు పట్ల కర్కశంగా వ్యవహరించింది.


# పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో మెడల్స్ సాధించిన సిబ్బందికి ఎస్పీ అభినందనలు



నల్గొండ, ఫిబ్రవరి 24: నాల్గొవ తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ - 2026 పోటీలు ఈ నెల 16 నుండి 21 వరకు గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం, సైబరాబాద్ పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ లో ఘనంగా జరిగాయి. ఈ క్రీడా పోటీల్లో నల్లగొండ జిల్లా పోలీస్ శాఖకు చెందిన సిబ్బంది పాల్గొని విశేష ప్రతిభ కనబరిచి పలు విభాగాల్లో మెడల్స్ సాధించారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మెడల్స్ సాధించిన సిబ్బందిని ఎస్పీ అభినందించారు. విధులతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చూపుతూ శాఖకు మంచి పేరు తీసుకువచ్చినందుకు సిబ్బందిని ప్రశంసించారు. భవిష్యత్‌లో జాతీయ స్థాయి పోటీల్లో కూడా మరింత ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. యాదాద్రి జోన్-ఎ పరిధిలోని వివిధ విభాగాలకు చెందిన సిబ్బంది ఈ క్రీడా పోటీల్లో పాల్గొని పలు మెడల్స్ సాధించడం విశేషం. ఈ కార్యక్రమంలో ఏ.ఆర్.డీఎస్పీ శ్రీనివాసులు, సీఐలు రాము, ఆదిరెడ్డి, నాగరాజు, ఆర్.ఐలు శ్రీనివాస్, సంతోష్, సురేశ్ పాల్గొన్నారు.

# బహుముఖ ప్రజ్ఞాశాలి ఏల్చూరి

## ఫిబ్రవరి 25...ఏల్చూరి సుబ్రహ్మణ్యం వర్ధంతి



ఏల్చూరి సుబ్రహ్మణ్యం ( ఆగష్టు 26, 1920 – ఫిబ్రవరి 25, 1995) ప్రసిద్ధ కవి, రచయిత, పాత్రి కేయులు. సహజ కవిగా, గొప్ప వక్తగా, ఉద్యమ ప్రవక్తగా, ప్రగతి శీల భావుకునిగా, తెలుగు సాహితీ లోకానికి సుపరిచితులు. ఆయన తెలుగు సాహిత్యంలో ప్రాముఖ్యత వహించిన అభ్యుదయ కవిత్వోద్యమ ఆద్యుల్లో ఒకరు. అభ్యుద య కవితా యుగంలో ప్రగతి శీల భావ దురంధరులైన బెల్లం కొండ రామదాసు, కుందుర్తి ఆంజనేయు లుతో కూడి, ఏల్చూరి సుబ్రహ్మ ణ్యం వెలువరించిన తొలి కావ్యం నయా గరా కవితల సంపుటి. అలా ముగ్గురు అభ్యు దయ నయాగరా కవులలో ఏల్చూరి ఒకరుగా నిలిచారు. తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందారు.

ఏల్చూరి సుబ్రహ్మణ్యం ఆగష్టు 25, 1920న రామయ్య. సుబ్బాయమ్మ దంపతులకు జన్మించారు. మద్దులపల్లి గురుబ్రహ్మశర్మ, భాగవతుల వెంకట సుబ్బారావు, అక్కిరాజు రామాపతి రావు, నాయని సుబ్బారావు తదితరుల వద్ద చిన్ననాడు విద్యా బుద్ధులు నేర్చారు. కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ ఇంట్లోనే ఉండి, విజయవాడ యస్.ఆర్.ఆర్ కళాశాలలో బి.ఎ. డిగ్రీ చేశారు. కవి సామ్రాట్ శిష్యుడు అయిన నందమూరి తారక రామారావు తో చిన్ననాటి నుండి స్నేహం ఉంది. అలాగే కొంగర జగ్గయ్య, ఏల్చూరి సుబ్రహ్మణ్యం ప్రాణ స్నేహితుల్లా మెదిలారు. కుందుర్తి ఆంజనేయులు, బెల్లంకొండ రామ దాసు, ఏల్చూరి సుబ్రహ్మణ్యం ముగ్గురు విద్యార్థి దశలో చదువుతున్న రోజులలో పరిచయస్తులై, తరువాతి కాలంలో "నయాగరా" కవితా సంకలనం సమ కూర్పుకు కారకులు అయినారు.

.'త్రివేణి' ఆంగ్లపత్రిక సంపాదకులు కోలవెన్ను రామకోటేశ్వరరావు, దేశిరాజు కృష్ణశర్మ, బెల్లంకొండ రాఘవరావు, గుడిపాటి వెంకట చలం, గుఱ్ఱం జాషువాల స్ఫూర్తిని పొంది, పులుపుల శివయ్య, కొల్లా వెంకయ్యల వల్ల కమ్యూనిస్టు ఉద్య మంలో కాలూనారు. 1940 లో నరసరావుపేటలో 'సన్యాసి' అన్న పత్రికను స్థాపించి అనిసెట్టి సుబ్బా రావు, దండమూడి కేశవరావు, బెల్లంకొండ రామదాసు, దేవరకొండ బాలగంగాధర తిలక్ మొదలైన కవుల తొలి రచనలను ఆ పత్రికలో ప్రచురించారు. అదే సంవత్సరంలో 'చిత్ర' అనే పత్రికను ప్రారంభిం చారు. 1941 లో నవ్యకళా పరి షత్తును స్థాపించి అనిసెట్టి సుబ్బా రావు, కుందుర్తి ఆంజనేయులు, బెల్లంకొండ రామదాసు, సముద్రాల రామానుజాచార్య, దేవరకొండ బాల గంగాధర తిలక్, రెంటాల గోపాలకృష్ణ మొదలైన అభ్యుదయ కవులు సభ్యులుగా కొనసాగారు. అలా ఆయా కవుల రచనలతో 1943 లో 'మాఘ్యమాల' కవితా సంపుటాన్ని వెలువరించారు. శ్రీశ్రీ కవిత్వ ప్రభావ స్ఫూర్తితో 1944 ఆగస్టులో బెల్లంకొండ రామదాసు, కుందుర్తి ఆంజనేయులు, ఏల్చూరి సుబ్రహ్మణ్యం ముగ్గురి కృషితో కవితా సంకలనం 'నయాగరా' వెలువడి అభ్యుదయ సాహిత్యోద్య మంలో అచ్చయిన తొలి కవితా సంపుటంగా నిలిచి పోయింది. అనిసెట్టి సుబ్బారావు, లక్ష్మీదేవిల పెళ్ళి కానుకగా గుంటూరులో విశ్వనాథ సత్యనారాయణ చేతుల మీదుగా ఆవిష్కృతం అయింది.

నయాగర కవితా సంకలనంలో బెల్లంకొండ, ఏల్చూరి, కుందుర్తి ఒక్కొక్కరూ మూడేసి ఖండ కావ్యాలను రచించి 9 ఖండ కావ్యాల సంకలనంగా ప్రచురిం చారు. ఈ సంకలనంలో ...కుందుర్తి ఆంజనేయులు మూడు రచనలు... జయిస్తుంది, తరువాత, మన్యంలో; బెల్లంకొండ రామదాసువి...

చెరసాల, నా గీతం, ఈ రోజున; అలాగే ఏల్చూరి సుబ్రహ్మణ్యం సంబంధిత....ప్రజాశక్తి, ఠాగూర్ చంద్ర సింగ్, విజయ ముద్ర ఖండ కావ్యాలు చేర్చ బడ్డాయి.

1956 లో తెలుగు సాహిత్యంలో ఏల్చూరి తొలి దీర్ఘ కవిత 'నవంబరు 7' విశాలాంధ్ర పత్రికలో వెలువడింది. తల్లావఝుల శివశంకర శాస్త్రి తో ఉన్న సాన్నిహిత్యం వల్ల ఏల్చూరి నవ్య సాహిత్య పరిషత్తు సభ్యునిగా చేరి, సమావేశాలకు హాజరయ్యారు. ప్రగతిశీల ఉద్యమాలలో పాల్గొ న్నారు. వందలాది రష్యన్ కవితలను ఆంగ్ల మాధ్యమం ద్వారా అనువదించారు. నృసింహ స్వామి పై శతకం కూడా రాశారు. శ్రీరంగం శ్రీనివాసరావు, ఆరుద్ర, అబ్బూరి వరదరాజేశ్వర రావు సంయుక్తంగా రాసిన "మేమే" కావ్యాన్ని సుబ్రహ్మణ్యంకు అంకితం ఇవ్వడం విశేషం. ఆంగ్లంలో వచ్చిన వందలాది రష్యన్ కవితలను తెలుగులోకి అనువదించారు. సోవియట్ భూమి పత్రికలో సుమారు 40వేల పేజీల అనువాద రచన చేశారు అంటే ఆయన గొప్పతనం స్పష్టం అవుతుంది. అభ్యుదయ కవిగా, అంతకు మించి కృషి పాత్రికేయుడిగా ఆయన చేసిన కృషి సాటిలేనిది.

1940 లో నరసరావుపేటలో 'సన్యాసి' అనే పత్రికను స్థాపించి, ప్రముఖ కవుల రచనలు ప్రచురిం చారు. పొగాకు లోకం' (గుంటూరు) పత్రిక సంపాదకులుగా, 1941 – 42లో ఆంధ్ర సర్వస్వము సహాయ సంపాదకునిగా, 1954-56లో ఆకాశ వాణిలో స్క్రిప్టు రైటరుగా... రాయప్రోలు రాజశేఖర్, జలసూత్రం రుక్మిణనాథశాస్త్రి లతో కలిసి ఆకాశవాణికి ఎన్నో స్క్రిప్ట్ లందించారు. మద్రాస్‌లో సినిమా లకు పాటలు కూడా రాశారు. 1952లో సోషలిస్టు పత్రికలో, 1956లోనేత' పత్రిక సంపాద కులుగా, 1961-1988లో సోవియ ట్ భూమి పత్రిక సంపాదక వర్గంలో, తర్వాత మద్రాసులో అభ్యుదయ పత్రిక నిర్వాహకసభ్యునిగా పని చేశారు.ప్రముఖ వేణుగాన విద్వాంసులు ఏల్చూరి విజయ రాఘవరావు ఆయన సోదరులు కాగా, సాహితీవేత్త ఏల్చూరి మురళీధరరావు ఆయన కుమారుడు.



-రామ కిష్టయ్య సంగన భట్ల,
9440595494

# 22వ డివిజన్‌లో చెత్త సేకరణ కోసం నూతన ట్రాక్టర్ కేటాయింపు..

## -మేయర్, కమిషనర్ కు ధన్యవాదాలు తెలియజేసిన కార్పొరేటర్ బండ రమణారెడ్డి....



కరీంనగర్, ఫిబ్రవరి 24: (నేటినిజం ప్రతినిధి) కరీంనగర్ నగరపాలక సంస్థ 22వ డివిజన్ లో చెత్త సేకరణ నిమిత్తం నూతన ట్రాక్టర్ ను కేటాయించారు. ట్రాక్టర్ కు మంగళవారం రోజున మేయర్ కోలగాని శ్రీనివాస్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ కోలగని శ్రీనివాస్ మాట్లాడుతూ డివిజన్లో చెత్త సేకరణకు అవసరమైన వాహనాల విషయంలో ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు.

వాహన కొరత ఉందని స్థానిక కార్పొరేటర్ బండ రమణారెడ్డి తమ దృష్టికి తీసుకురాగానే నూతన ట్రాక్టర్ ను డివిజన్ కు కేటాయించడం జరిగిందన్నారు. డివిజన్లో పారిశుద్ధ్య పనులు, చెత్త సేకరణ కార్యక్రమాలు సక్రమంగా జరిగేలా చూస్తామన్నారు.

డివిజన్ అవసరా ల కోసం అడగగానే నూతన ట్రాక్టర్ కేటాయించిన మేయర్ కోలగని శ్రీనివాస్, కమిషనర్ ప్రపుల్ దేశాయ్ లకు కార్పొరేటర్ రమణారెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బోయిన్పల్లి ప్రవీణ్ రావు, వాసాల రమేష్, గుగ్గిల్లపు రమేష్, వంగల పవన్ ,పెద్దపల్లి జితేందర్, మొండన్న, ఎన్నం ప్రకాష్ , వేముల చంద్రశేఖర్ , వెంకటేష్ లతోపాటు బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వయోవృద్ధులు ఆస్తుల విషయంలో జాగ్రత్త వహించాలి

## - వేములవాడ ఆర్డీవో రాధ- 'సీనియర్ సిటిజెన్ గొంతుక పిలుపు' పత్రిక ఆవిష్కరణ



రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 24 నేటినిజం (ప్రతినిధి): :వయోవృద్ధుల సమస్యలు, వారి ఆవేదనలను ప్రతిబింబించేలా రూపొందించిన "సీనియర్ సిటిజెన్ గొంతుక పిలుపు" పత్రికను మంగళవారం వేములవాడ ఆర్డీవో రాధ ఆవిష్కరించారు. తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్ జిల్లా అధ్యక్షులు చేపూరి బుచ్చయ్య అధ్యక్షతన, కోడం నారాయణ కార్యనిర్వహణలో ఆర్డీవో కార్యాలయంలో ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది.

ఈ సందర్భంగా ఆర్డీవో రాధ మాట్లాడు తూ సీనియర్ సిటిజన్లు తమ జీవితాంతం కష్టపడి సంపాదించిన ఆస్తులన్నింటినీ ఒకేసారి పిల్లల పేరిట రాయకూడదని హితవు పలికారు.

తమ భవిష్యత్తు అవసరాలకు సరిపడా ఉంచుకున్న తర్వాతే మిగిలినది ఇవ్వాలని సూచించారు. 'పిలుపు' పత్రిక వయో వృద్ధుల హక్కుల పట్ల అవగాహన కల్పించేలా ఉండటం అభినందనీయమన్నారు.

వయోవృద్ధుల సమస్యలు, కేసుల త్వరితగతిన పరిష్కారం కోసం ఎనిమిది మంది సభ్యులతో కూడిన జాబితాను ఆర్డీవోకు అందజే శారు. సి. రామరాజు, ధ్యావనపల్లి శ్రీహరి, డాక్టర్ పి. సత్యనారాయణ తదితరుల సహకారం తీసుకోవాల్సిందిగా కోరగా, అందుకు ఆర్డీవో సానుకూలంగా స్పందించారు. దీనివల్ల వృద్ధుల సమస్యలు వేగంగా పరిష్కారమవుతాయని కమిటీ ఆశాభావం వ్యక్తం చేసింది.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ జనపాల శంకరయ్య, కోశాధికారి దొంత దేవదాసు, ఉపాధ్యక్షులు ఎనుగుల ఎల్లయ్య, సభ్యులు కొమ్ము శంకరయ్య, బుస దశరథం, కే. రాజిరెడ్డి, గూడూరి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# అంతేకాక సామరస్య దౌత్యానికి ఓ శక్తిమంతమైన సాధనం కూడా: ఉపరాష్ట్రపతి

న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 24: సాంకలా ఫౌండేషన్ సహకారంతో యూఎస్-ఇండియా పార్ట్‌నర్‌షిప్ ఫోరమ్ న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన టూరిజమ్ లీడర్‌షిప్ సమ్మిట్-2026ను ఉద్దేశించి ఉపరాష్ట్రపతి శ్రీ సి.పి. రాధాకృష్ణన్ ఈ రోజు ప్రసంగించారు.

పర్యటన రంగ ఆశలను ఉత్సవంలా జరుపుకోవడం ఒక్కటే కాకుండా ప్రయాణ, ఆతిథ్య రంగంలో భారత్-అమెరికా ఆర్థిక కారిడార్ ను పటిష్ఠపరచడానికి ఒక వ్యూహాత్మక మార్గసూచీని కూడా ఆవిష్కరిస్తున్న ఓ వేదికను నిర్వాహకులు అందుబాటులోకి తీసుకు వచ్చారంటూ ఉపరాష్ట్రపతి ప్రశంసలు కురిపించారు.

పర్యటన రంగం కేవలం ఒక పరిశ్రమ కాదు... అంతకు మించిందని శ్రీ సి.పి. రాధాకృష్ణన్ స్పష్టం చేశారు. అది సంస్కృతుల మధ్య వారధిలా పనిచేస్తోందనీ, ఆర్థిక అవకాశాల్ని కల్పిస్తోందనీ, సామరస్య పూర్వక దౌత్యానికి ఒక శక్తిమంతమైన సాధనంగా ఉంటోందనీ వర్ణించారు.

భారత్, అమెరికాల పర్యటన రంగాలు రెండు దేశాల ప్రజల మధ్య పరస్పర సంబంధాలు, ఉమ్మడి విలువలు, ఔత్సాహిక పారిశ్రామికత్వ స్ఫూర్తిలతో పాటు భారతీయ ప్రవాసీ సముదాయం చైతన్యాన్ని కూడా చాటిచెబుతున్నాయని ఆయన అన్నారు.

భారత్ అమలుచేస్తున్న దూరదృష్టి కలిగిన కార్యక్రమాల్ని గురించి ఉపరాష్ట్రపతి ప్రస్తావిస్తూ, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ మార్గదర్శకత్వంలో 'టూరిజమ్ విజన్-2029'ని భారత్ ప్రకటించిన సంగతిని గుర్తుకు తెచ్చారు. ప్రతి రాష్ట్రంలో పటిష్ఠ మౌలిక సదుపాయాల్నీ, ప్రపంచ స్థాయి పర్యటన స్థలాల్నీ అభివృద్ధి చేయడమే ఈ విజన్ ఉద్దేశమని ఆయన వివరించారు.

ఈ కార్యక్రమం ఒక్క సౌందర్యీకరణకే పరిమితం కాదనీ, ఇది నిరంతరాయ సంధానం, ఆధునిక సౌకర్యాలు, భద్రత, స్థిరత్వం, డిజిటల్ ఏకీకరణలతో పాటు సమృద్ధ పర్యటక అనుభవాలతో కూడిన సమగ్ర పర్యటన అనుబంధ విస్తారిత వ్యవస్థలను ఏర్పాటు చేయడంపై శ్రద్ధ వహిస్తుందనీ ఉపరాష్ట్రపతి స్పష్టం చేశారు.

భారత నాగరికతా సంబంధ వారసత్వం, వైవిధ్యపూరిత భౌగోళిక స్వరూపం, జనాభాలో పని చేసే వయసున్న వారి సంఖ్య ఎక్కువగా ఉండటం వల్ల కలిగే ప్రయోజనాలను గురించి ఉపరాష్ట్రపతి వెల్లడిస్తూ, ప్రపంచ స్థాయిలో పర్యటన రంగానికి కొత్త నిర్వచనాన్ని ఇవ్వడానికి దేశం సిద్ధంగా ఉందన్నారు. ఉన్నత శ్రేణికి చెందిన పర్యాటక సౌకర్యాలు, వ్యాఖ్యాకేంద్రాలు, చివరి బిందువు వరకూ సంధాన సదుపాయం, మన్నిక కలిగిన పద్ధతులు, డిజిటల్ మాధ్యమం సాయంతో కథలను చెప్పే సౌలభ్యం వంటి వాటి ద్వారా భారత్‌లోని యునెస్కో ప్రపంచ వారసత్వ స్థలాల పరిరక్షణ, ప్రపంచ స్థాయి అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

పర్యావరణ సంబంధిత లక్ష్యాలకు అనుగుణంగా పర్యటన రంగ అభివృద్ధి ఉండాలని శ్రీ సి.పి. రాధాకృష్ణన్ సూచించారు. భిన్న వాతావరణ స్థితులకు తట్టుకొని నిలిచే మౌలిక సదుపాయాలు, సమాజమే సారథ్యాన్ని వహించే పర్యటన నమూనాలతో పాటు ప్రాకృతిక వారసత్వ, సాంస్కృతిక వారసత్వాల పరిరక్షణ ఎంతయినా అవసరం అని ఆయన అన్నారు. అంతరిక్షం, డిజిటల్ మాధ్య మాన్ని ఉపయోగించుకొంటూ సేవలను ప్రజల అందుబాటులోకి తీసుకు రావడం, పునరుత్పాదక ఇంధనం, ఉన్నత శ్రేణికి చెందిన తయారీ సామర్థ్యం.. వీటిలో భారత్ సాధించిన విజయాలను కళ్లకు కట్టే సరికొత్త యుగపు పర్యటన స్థలాల్ని అభివృద్ధి పరచడంపైన దృష్టిని కేంద్రీకరించడం ముఖ్య మని కూడా ఆయన వివరించారు.

## కీర్తి సురేష్, ఆంటోని తట్టిల్ 'హౌస్ ఆఫ్ ఫన్'లో..

# కొచ్చిలోని అందమైన కలల సౌధం



హైదరాబాద్, ఫిబ్రవరి 24: నగరం నడిబొడ్డున పచ్చని ప్రకృతి ఒడిలో వ్యక్తిగత జ్ఞాపకాలు, వినూత్న కళాఖండాల కలయికతో నటి కీర్తి సురేష్ తన ఇంటిని ఒక అద్భుత ప్రపంచంగా తీర్చిదిద్దుకున్నారు. పదిహేనేళ్ళ ప్రేమ ప్రయాణానికి ప్రతీకగా నిలిచే ఈ 'హౌస్ ఆఫ్ ఫన్' విశేషాలు 'ఏషియన్ పెయింట్స్ – వేర్ ద హార్ట్ ఈజ్' సీజన్ 9, రెండో ఎపిసోడ్‌లో ఆమె మనతో పంచుకున్నారు. ఈ ఇంటికి వారు 'హౌస్ ఆఫ్ ఫన్' అని పేరు పెట్టుకున్నారు. అపార్ట్‌మెంట్ పై అంతస్తులో ఉన్న ఈ నివాసం నుంచి చుట్టూ ఉన్న ప్రకృతిని ఆస్వాదించవచ్చు. ధారాళంగా వచ్చే సూర్యరశ్మి, ప్రశాంతమైన వాతావరణం ఈ ఇంటి ప్రత్యేకత. 'కలిసి ఒక ఇల్లు నిర్మించుకోవడం అనేది ఒక అద్భుతమైన అనుభూతి. మాకు అన్నింటికంటే ముఖ్యమైనది సౌకర్యం' అని కీర్తి ఈ సందర్భంగా పేర్కొన్నారు. గోడపై నిలువుగా ఉన్న రెండు కాన్వాస్ పెయింటింగ్స్ అందరి దృష్టిని ఆకర్షిస్తాయి. అందులో ఒకటి వారు ప్రేమించుకోవడం మొదలుపెట్టిన రోజు నాటి చంద్రుడి ఆకారం కాగా మరొకటి సరిగ్గా 15 ఏళ్ల తర్వాత వారి వివాహం జరిగిన రోజు నాటిది. తన పెళ్లి జ్ఞాపకాలను పంచుకునే క్రమంలో కీర్తి సహజంగానే మలయాళం, తెలుగు, తమిళ భాషల్లో మాట్లాడుతూ తన సంతోషాన్ని వ్యక్తపరిచారు. సంప్రదాయం, ఆధునికత కలగలిసిన ఈ ఇల్లు కేవలం ఒక కట్టడంలా కాకుండా వారి 15 ఏళ్ల ప్రయాణానికి నిలువుటద్దంలా కనిపిస్తోంది. ఈ ఇంటి రూపకల్పనలో రంగులు కూడా కీలక పాత్ర పోషిస్తాయి. ప్రకాశవంతమైన డెకర్, ఫర్నిచర్, ఛాయాచిత్రాలు, పచ్చని రంగులు ఆ ప్రదేశానికి జీవం పోస్తుంటే నలుపు-తెలుపు ఫ్లోర్ టైల్స్ ఇంటికి సమతుల్యతను, ప్రశాంతతను అందిస్తాయి. కీర్తి సురేష్ జాతీయ అవార్డు గెలుచుకున్న సమయంలో 'మహానటి' సినిమా గురించి వచ్చిన వార్తాపత్రిక క్లిప్పింగ్‌లతో తయారు చేసిన ఒక ఫ్రేమ్డ్ ఆర్ట్‌వర్క్ ఇక్కడ ఉంది. ఇది ఆమె నటనా ప్రయాణంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుంది. ఈ దంపతుల బెడ్‌రూమ్ సంప్రదాయ, ఆధునిక అభిరుచుల కలయికగా ఉంటుంది. కేరళ శైలి మంచం, ఒక సంప్రదాయ అనుభూతిని ఇస్తుంది. ఏషియన్ పెయింట్స్ నిలయ ఆర్క్ అందించిన లైట్ గ్రే టెక్చర్డ్ వాల్ గదిలో మృదువైన, వెచ్చని వాతావరణాన్ని సృష్టిస్తుంది.

# రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత : ఎస్ఐ క్రాంతి కుమార్



నల్గొండ, ఫిబ్రవరి 24: రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తుంగతుర్తి ఎస్ఐ క్రాంతి కుమార్ అన్నారు. రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం అరైవ్ అలైవ్ లో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని జడ్.పి.హెచ్.ఎస్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలను, ప్రమాద మరణాలను నివారించడం కోసం ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు రోడ్డు భద్రత పట్ల, ప్రమాదాల నివారణ పట్ల చుట్టుపక్కల వారిని, తల్లిదండ్రులను చైతన్యవంతం చేయాలని కోరారు. ప్రయాణ సమయంలో హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పక ధరించాలని సూచించారు. వాహనాలకు అన్ని రకాల అనుమతి పత్రాలు కలిగి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుజ్జ భాస్కర్, సహదేవ్, కానిస్టేబుల్ విజయ్ పాల్గొన్నారు.

# గోదావరిఖనిలో హిజ్రాల పండగ..

## తొలిసారిగా రాష్ట్ర స్థాయి సమ్మేళనం

కరీంనగర్, ఫిబ్రవరి 24: : పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో తొలిసారిగా హిజ్రాలు పండుగ చేసుకున్నారు. రోజంతా ఆట పాటలు, నూతన వస్త్రాలంకరణ, అమ్మవారి పూజా మహోత్సవాలతో ఆకట్టుకున్నారు. గోదావరిఖని గంగానగర్ లోని ఓ ఫంక్షన్ హాలులో మంగళవారం రాష్ట్ర సమ్మేళనం జరుపుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి సుమారు 1500 మంది వరకు హిజ్రాలు తరలిరావడంతో సందడి నెలకొంది.

అమ్మ తెలంగాణ రాష్ట్ర హిజ్రా సంఘం అధ్యక్షురాలు ఓరుగంటి లైలా ఆధ్వర్యంలో జరిగిన ఈ రాష్ట్ర వేడుక సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలతో ఆలరించారు. మునుపెన్నడూ లేనివిధంగా ఆట, పాట, జల్సా, సారీ ఫంక్షన్, అమ్మవారి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శివాని, భవానీ, లాస్య, సుపు, అనిత శ్రీ, నమ్మవ్వతోపాటు అధిక సంఖ్యలో హిజ్రాలు పాల్గొన్నారు.

# తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలితకు ప్రధానమంత్రి నివాళి

న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 24: ఈ రోజు తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జే జయలలిత జయంతి సందర్భంగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నివాళులు అర్పించారు. ప్రజాకర్షక నాయకురాలిగా, గొప్ప పరిపాలనా దక్షురాలిగా ప్రజల హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోయారని ప్రధానమంత్రి కొనియాడారు.

తమిళనాడు ముఖ్యమంత్రిగా ఆమె పని చేసిన కాలాన్ని శ్రీ మోదీ గుర్తు చేశారు. మహిళా సాధికారత, సామాజిక న్యాయం, సమగ్రాభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ.. సంక్షేమ పాలన అందించారన్నారు.

ఆమెతో జరిపిన సంభాషణలను ప్రధానమంత్రి ఆనందంగా గుర్తు చేసుకున్నారు.

ఆమె జీవితం, కృషి గురించి కొన్ని ప్రత్యేక అంశాలను ఈ నెల మన్ కీ బాత్ కార్యక్రమంలో శ్రీ మోదీ పంచుకున్నారు.

''జయలలిత గారు జయంతి సందర్భంగా ఆమెను స్మరించుకుంటున్నాను. అనేక మంది హృదయాలు, ఆలోచనల్లో ప్రజాకర్షణ ఉన్న నాయకురాలిగా, గొప్ప పరిపాలనా దక్షురాలిగా ఆమె శాశ్వత స్థానం సంపాదించుకున్నారు. ఆమె జీవితమంతా ధైర్యాన్ని, సంకల్పాన్ని ప్రదర్శించారు.

మహిళా సాధికారత, సామాజిక న్యాయం, సమగ్రాభివృద్ధిపై దృష్టి సారించి విజయవంతంగా సంక్షేమ పాలనను అందించారు.

ఆమెలో కరుణ, దృఢ నిర్ణయ సామర్థ్యం రెండూ ఉన్నాయి. ఆమెతో నా సంభాషణలను ఆనందంగా గుర్తు చేసుకుంటున్నాను.

# మహీంద్రా యూనివర్సిటీ 50కు పైగా విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థల ఐరో, ఈథర్ 2026 ఉత్సవం




హైదరాబాద్, ఫిబ్రవరి 24: మహీంద్రా యూనివర్సిటీ తన వార్షిక క్రీడా, టెక్నో-సాంస్కృతిక ఉత్సవాలైన ఐరో, ఈథర్ తాజా సంచికలను విజయవంతంగా నిర్వహించింది. దేశవ్యాప్తంగా 50కు పైగా కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్న ఈ వారాంత వేడుకలు క్రీడాకారులు, కళాకారులు, సృజనశీలులను ఒకే వేదికపైకి తీసుకువచ్చాయి. సమగ్ర విద్యా విధానం నాయకత్వాభివృద్ధిపై విశ్వవిద్యాలయం కట్టుబాటును ఈ వేడుకలు మరింత బలపరిచాయి.

ఐరో 2026 సందర్భంగా విశ్వవిద్యాలయ ప్రాంగణం ఉత్సాహభరిత క్రీడా వేదికగా మారింది. 20కు పైగా క్రీడా విభాగాల్లో పోటీలు నిర్వహించబడ్డాయి. ఖో-ఖో, పవర్‌లిఫ్టింగ్, పూల్ మరియు స్నూకర్, ఈత (ఫ్రీ స్టైల్, బ్యాక్ స్ట్రోక్, బ్రెస్ట్ స్ట్రోక్), టేబుల్ టెన్నిస్, టెన్నిస్, త్రోబాల్, వాలీబాల్, యోగా వంటి విభాగాలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి.

ఈ క్రీడా ఉత్సవంలో బిట్స్ పిలాని, ఐ ఐ టి మద్రాస్, ఐ ఐ టి హైదరాబాద్, వోక్సెన్ యూనివర్సిటీ, నల్సార్ లా యూనివర్సిటీ, అనురాగ్ యూనివర్సిటీ, సింబయోసిస్ హైదరాబాద్, ఓ.పి. జిందాల్ యూనివర్సిటీ తదితర విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com